RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 41 శుక్రవారం, మార్చి 08, 2024 పేజీలు : 4


### సిఎం రేవంత్‌రెడ్డి అన్నకి గుండెపోటు

సిఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డికి గుండెపోటుకు గురయ్యారు. మార్చి 7న ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో హుటాహుటీన ఆయన్ను చికిత్స నిమిత్తం మాదాపూర్ మెడికేర్ ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు ఆయనకు స్టెంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు వెల్లడించారు. రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ బాధ్యతలను తిరుపతిరెడ్డి చూసుకుంటున్నారు.

## హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా...

# అభివృద్ధి చేస్తాం

## : సిఎం రేవంత్



**హైదరాబాద్ మార్చి, 7 :** అభివృద్ధి కోసం భవిష్యత్ లోనూ కేంద్రం సహకారాన్ని కోరుతూనే ఉంటామని.. కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గురువారం రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్‌కు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 11.3 కిలో మీటర్లు పొడవున 6 లేన్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎలివేటేడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఎలివేటేడ్ కారిడార్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ముఖద్వారమని చెప్పారు. రాబోయే రోజుల్లో కంటోన్మెంట్ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. మా పోరాటం ఫలించిందని కేటీఆర్ అంటుండు.. ఏం పోరాటం చేసిండు.. ట్విట్టర్ లో పోస్టులు పెట్టుడా? అని సిఎం ఎద్దేవా చేశారు. మేం అనుమతులు తీసుకొస్తే ఆయన పోరాటం అని చెప్పుకుంటుండని.. ఈ వేదికగా కేటీఆర్ కు తాను సూచన చేస్తున్నా.. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఇందిరా పార్కు వద్ద కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలన్నారు. కేటీఆర్ చచ్చుడో అభివృద్ధికి నిధులు వచ్చుడో తేలే వరకు దీక్ష చేయాలని.. ఆయన దీక్షకు దిగితే మా కార్యకకర్తలే కెటిఆర్ ను కంచె వేసి కాపాడుతారని సీఎం రేవంత్ అన్నారు.

## సక్సెస్‌ను ఆస్వాదించండి....

# బాధ్యతను మరవొద్దు

**హైదరాబాద్ మార్చి, 7 (సూర్యసేన ప్రతినిధి):** మీరు మీ సక్సెస్ ను ఆస్వాదించండి, కాని ఎప్పుడూ మీ బాధ్యతను మరిచిపోవద్దు. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్మీ డెంటల్ కాలేజి విద్యార్థులకు సూచించారు. మంగళవారం జరిగిన సికింద్రాబాద్ ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ స్నాతకోత్సవ వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ మీ కళాశాల స్నాతకోత్సవానికి హాజరు కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లోని ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

మీ కృషి, అంకితభావం మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చాయని, ఈ రోజు నుంచి మీరు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారని, మీరు చేసే పనులు మీకు, మీకుటుంబానికే కాదు మీ కాలేజ్ కు గుర్తింపును తీసుకొస్తాయని సిఎం అన్నారు. ఎసిడిఎన్ మన సైనికుల పిల్లలకు సేవలందించడం మన సైన్యానికి, దేశానికి గర్వకారణమని అన్నారు. అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




## రాహుల్ పోటీపై...

# స్మృతి ఇరానీ ఎద్దేవా



అమేఠీ, ఉత్తర్ ప్రదేశ్: అమేఠీ లోక్‌సభ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడంలో జరుగుతున్న జాప్యాన్ని స్థానిక బిజెపి ఎంపి స్మృతి ఇరానీ ఎద్దేవా చేశారు. అమేఠీ శక్తి ఏమిటో వారు(కాంగ్రెస్) గ్రహించినట్లు కనపడుతోందని, ఓటమి భయం ఆ పార్టీని వెంటాడుతోందని ఆమె వ్యాఖ్యానించారు. తన నియోజవకర్గంలో రూ. 206 కోట్ల విలువైన 284 ప్రాజెక్టులలో కొన్నిటిని ప్రారంభించగా కొన్నిటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమేఠీ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేయడం గురించి విలేకరులు ప్రశ్నించగా ఆ పార్టీ నుంచి ఎవరు పోటీచేస్తారో ప్రస్తుతానికి తనకు తెలియదని ఆమె అన్నారు. అయితే ఇక్కడి నుంచి పోటీ చేసే అభ్యర్థి పేరును ప్రకటించడానికి ఆ పార్టీ వారు ధైర్యాన్ని కూడగట్టుకోలేకపోవడాన్ని బట్టి చూస్తే అమేఠీ శక్తి, ఓటమి భయం వారిని వెన్నాడుతోందని అర్థమవుతోందని ఆమె వ్యాఖ్యానించారు. ఇది వారి ఓటమిని స్పష్టంగా సూచిస్తోందని ఆమె చెప్పారు.


## ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం

# తీపి కబురు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం తీపి కబురు చెప్పింది. వారి కరవు భత్యాన్ని 4 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పటివరకు 46 శాతంగా ఉన్న డిఎ 50 శాతానికి చేరుకుంటుంది. 2024 జనవరి 1నుంచే ఈ పెంపు అమలులోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. తాజా నిర్ణయంతో కోటి మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. గురువారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం అనంతరం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ మీడియాకు చెప్పారు. డిఎ, పెన్షనర్ల డిఆర్ పెంపు కారణంగా 202425 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ ఖజానాపై రూ.15,014 కోట్ల మేర భారం పడనుంది. డిఎ పెంపుతో పాటుగా ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, క్యాంటీన్ అలవెన్స్, డిప్యుటేషన్ అలవెన్స్ లాంటి ఇతర అలవెన్సులను కూడా 25 శాతం పెంచారు. ఇంటి అద్దె అలవెన్స్( హెచ్‌ఆర్ అలవెన్స్)ను కూడా బేసిక్ వేతనంలో ఇప్పుడున్న 27 శాతం, 19 శాతం, 9 శాతంనుంచి 30 శాతం, 20 శాతం, 10 శాతానికి పెంచారు. అలాగే గ్రాట్యుటీ ప్రయోజనాల సీలింగ్‌ను కూడా ఇప్పుడున్న రూ.20 లక్షలనుంచి రూ.25 లక్షలకు పెంచారు.వివిధ అలవెన్సుల పెంపు భారం ఏటా రూ.9,400 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా.

## భారత్‌పై ఎవరు కన్ను వేసినా

# శిక్ష తప్పదు



న్యూఢిల్లీ : మన సాయుధ బలగాలు మరింత శక్తిమంతం అయ్యాయని, భారత్‌పై ఎవరు కన్ను వేసినా గట్టి గుణపాఠం చెప్పేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం ప్రకటించారు. తూర్పు లడఖ్‌లో చైనాతో సుమారు నాలుగు సంవత్సరాలుగా సాగుతున్న సరిహద్దు వివాదం, హిందు మహాసముద్రంలో చైనీస్ మిలిటరీ ప్రవేశంపై ఆందోళనల నేపథ్యంలో రక్షణ శాఖ మంత్రి ఆ ప్రకటన చేశారు. దేశ రక్షణ వ్యవస్థకు ప్రజల దూరదృష్టికి అనుగుణంగా ప్రభుత్వం 'కొత్త శక్తి సమకూర్చింది ' అని, దృఢమైన, స్వయం సమృద్ధ సైన్యంతో ప్రపంచ వేదికపై శక్తిమంతమైన దేశంగా భారత్ ఆవిర్భావానికి అది దారి తీసిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఎన్‌డిటివి నిర్వహించిన రక్షణ శాఖ సంబంధిత శిఖరాగ్ర సదస్సులో రాజ్‌నాథ్ ప్రసంగిస్తూ, 'భారతీయత భావంతో' దేశ రక్షణ వ్యవస్థను మరింత బలిష్టం చేయడంపై మోడీ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించినందున అది ఎప్పటికన్నా మరింత దృఢంగా ఉందని చెప్పారు.

# రూ 137.76 కోట్లతో...

# తెలంగాణలో అభివృద్ధి పనులు

**హైదరాబాద్ మార్చి, 7 :** తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0, ప్రసాద్ పథకంలో భాగంగా రూ. 137.76 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలను శ్రీనగర్ నుంచి వర్చువల్ గా ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. హైదరాబాద్ బల్కంపేటలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో భాగంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ%ౌా%. మన దేశంలో పర్యాటక రంగాన్ని ఎంతగానో అభివృద్ధి చేసేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కోరారు.

దుబాయ్, యూరప్ , సింగపూర్ దేశాలతో పోలిస్తే భారతదేశ పర్యాటక రంగం అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారని, కానీ పర్యాటక అభివృద్ధికి వేల కోట్ల రూపాయాలు కేటాయించాల్సిన అవసరం ఉందని అన్నారు. టూరిస్టుల రాక, పర్యాటక రంగ అభివృద్ధి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతంగా నిలుస్తుందని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అభివృద్ధి పనుల వివరాలను మంత్రి జూపల్లి వివరిస్తూ... ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్ల వ్యయంతో హైదరాబాద్ లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన భవనం, తాగునీటి సదుపాయం, కెఫ్‌టేరియా, టికెట్ కౌంటర్, తదితర అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని వర్చువల్ గా ప్రధాని మోడీ ప్రారంభించారన్నారు. ప్రసాద్ పథకంలో రూ.38.90 కోట్ల వ్యయంతో గద్వాల జిల్లా అలంపూర్ లోని జోగులాంబదేవి ఆలయంలో




అభివృద్ధిలో భాగంగా నిర్మించిన ప్రసాద్ స్కీం భవనం, సాంస్కృతిక భవనం, అన్నదాన సత్రం, తదితర వాటికి మోదీ ప్రారంభోత్సవం చేశారని తెలిపారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి కోటను స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.56.81 కోట్ల వ్యయం ( ప్యాకేజీ 1) తో అభివృద్ధి చేయనున్నారని మంత్రి జూపల్లి తెలిపారు. ఇంకా భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరిత వనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్ వే నిర్మాణానికి వర్చువల్ గా శంకుస్థాపన చేశారని తెలిపారు. స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.38 కొట్ల వ్యయం ( ప్యాకేజీ -1) తో వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ ప్రాంతాన్ని ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నారని తెలిపారు.

# బిజెపిలో చేరిన కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి



కోల్‌కత: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా రాజీనామా చేసిన రెండు రోజులకే అభిజిత్ గంగోపాధ్యాయ గురువారం బిజెపిలో చేరిపోయారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న గంగోపాధ్యాయ మంగళవారం తన పదవికి రాజీనామా చేసిన అనంతరం తాను త్వరలోనే కాషాయ కండువా కప్పుకోనున్నట్లు ప్రకటించారు. గురువారం అధికారికంగా బిజెపిలో చేరిన అనంతరం గంగోపాధ్యాయ విలేకరులతో మాట్లాడుతూ తాను కొత్త రంగంలోకి ప్రవేశించానని చెప్పారు. బిజెపిలో చేరడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ పార్టీ సైనికుడిగా తాను పనిచేస్తానని తెలిపారు. రాష్ట్రంలో అవినీతికర టిఎంసి ప్రభుత్వాన్ని గద్దెదించడమే తన లక్షమని ఆయన ప్రకటించారు. పాల్ట్ లేక్ లోని బిజెపి కార్యాలయం వద్ద గంగోపాధ్యాయకు ఘన స్వాగతం లభించింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ ఆయనకు పార్టీ పతాకాన్ని అందచేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## సంపాదకీయం

### 30 ట్రిలియన్

# ఆర్థికంగా భారత్....

'నేను మూడోసారి అధికారాన్ని చెలాయించడానికి తాపత్రయపడడం లేదు. ఈ దేశంలో పేద పిల్లల భవిష్యత్తు కోసం, కోట్లాది మహిళలు, యువత కలలు నెరవేర్చడం కోసం, ప్రపంచ దేశాల్లో అగ్ర రాజ్యంగా భారత్ గుర్తింపు పొందడం కోసం బీజేపీ మళ్లీ అదికారంలోకి రావాలని భావిస్తున్నాను' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల బీజేపీ జాతీయ సదస్సులో స్పష్టం చేశారు. మరోసారి అధికారం రావడం అతి పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను. దేశ ప్రజలు బీజేపీపై మరింత విశ్వాసం పెంచుకుని తమ కలల్ని మరింత సార్థకం చేస్తుందనే ఆశలతో మనను అధికారంలోకి తీసుకువస్తున్నారు. అందువల్ల మన బాధ్యత మరింత పెరుగుతుందని' మోదీ చెప్పారు. ప్రజల కలల్ని తప్పక నెరవేరుస్తామనే విశ్వాసం కలిగించేందుకు మన పార్టీ ప్రతి కొత్త ఓటరును చేరుకోవాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని మోదీ అన్నారు. 'రాబోయే 100 రోజుల్లో, మనమందరం ప్రతి కొత్త ఓటరు, ప్రతి లబ్ధిదారుడు, ప్రతి కమ్యూనిటీని చేరుకోవాలి. అందరి విశ్వాసం, మద్దతును మనం గెలుచుకోవాలి...' అని ఆయన చెప్పారు. ప్రతిపక్షాలకు ఎలాగూ అభివృద్ధి గురించిన ఆలోచన లేదు. వికసిత్ భారత్ గురించి దేశమంతటా మారుమ్రోగుతున్నప్పటికీ ప్రతిపక్ష నేతలు దాని గురించి పెదవి విప్పడం లేదు. అందుకు కారణం కళ్ల ముందు జరుగుతున్న అభివృద్ధి గురించి తప్పుడు వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తమను తిరస్కరిస్తారని వారు భయపడుతున్నారు. కేంద్రంలో మూడోసారి మోదీ సారథ్యంలో బీజేపీ అధికారంలోకి వచ్చే విషయంపై దేశంలో ఎవరికీ సందేహం లేదు. అసలు అధికారంలోకి వస్తామా, లేదా అన్న సంశయం మోదీకి ఎప్పుడూ లేదు. 370 సీట్లకు పైగా బీజేపీ సాధించాలనే లక్ష్యాన్ని ఎలా నెరవేర్చుకోవాలన్న విషయంపై ఆయన ఎప్పుడో పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఆ విషయానికి సంబంధించి పార్టీ వ్యూహరచన ఇప్పటికే పూర్తయింది. ఎంతో ముందుగా వ్యూహరచన చేయకపోతే ఒక్క రోజులోనే బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఒకేసారి 195 మంది అభ్యర్థులను ఖరారు చేయగలిగేదే కాదు. మొదటి జాబితాలోనే 33 మంది సిట్టింగ్ ఎంపీలను తొలగించారంటే, 34 మంది కేంద్రమంత్రులకు మళ్లీ అవకాశాలిచ్చారంటే బీజేపీ ఎంతో కాలం నుంచి అభ్యర్థుల పనితీరును, బలాబలాలపై విభిన్న వర్గాల నుంచి సమాచారం సేకరించిందని అర్థమవుతోంది. అధికారంలోకి రావడం మాత్రమే కాదు, అధికారంలోకి వచ్చిన వెంటనే ఏమి చేయాలన్న విషయమై కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే నిర్ణయించుకున్నారు. మరో రెండు నెలల పాటు దేశంలో ఎన్నికల హడావిడి ఉన్నప్పటికీ అభివృద్ధి ఆగకూడదని ఆయన భావిస్తున్నారు. అందుకే ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి ముందే ఆయన బుధవారం నాడు అత్యంత కీలకమైన కేంద్ర కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే వంద రోజులకే కాదు, అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో, ఆ తర్వాత రానున్న అయిదు సంవత్సరాల్లో ఏమి చేయాలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిందిగా ఆయన కేంద్ర కేబినెట్ మంత్రులను, అధికారులను ఆదేశించారు. మనం తీసుకోవాల్సిన కీలక చర్యలేమిటి, వాటిలో వేగంగా ఎన్నిటిని అమలు చేయగలం, మన ప్రాధాన్యాలేమిటో, వ్యూహాలేమిటో రూపొందించి కేబినెట్ సెక్రటేరియట్‌కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికలైన తర్వాత తమ మంత్రి పదవులు ఉంటాయా లేదా అన్న ఆలోచన లేకుండా దేశం గురించి ఆలోచించి ప్రణాళికలు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దేశాన్ని ప్రపంచంలో అగ్రరాజ్యంగా మార్చాలన్న లక్ష్యం తప్ప మరే లక్ష్యం మోదీ మనసులో లేదు. మేలో అధికారంలోకి రాగానే వికసిత్ భారత్‌ను సాధించేందుకు వందరోజుల ఎజెండాను కూడా ఆయన రూపొందించుకున్నారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రవేశపెడుతున్న తీరునే కాకుండా ప్రభుత్వ వ్యవస్థల్ని కూడా నిర్మాణాత్మకంగా మార్చేందుకు ఆయన మనసులో ఎన్నో నిర్ణయాలు ఉన్నాయని కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆయన చేసిన సుదీర్ఘ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది. ప్రగతిశీలమైన నిర్ణయాలు ఉంటాయని ఆయన ఇప్పటికే సంకేతాలు పంపుతున్నారు. బడ్జెట్‌లో వార్షిక లక్ష్యాలతో పాటు, దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు తగిన చర్యలు ఉండాలని ఆయన భావిస్తున్నారు. 2047 కల్లా దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు వచ్చే అయిదేళ్లలో ఏమి చేయాలో ఆయన మనసులో ఒక స్పష్టత ఉన్నది. తన టీమ్ కూడా తన లాగే ఆలోచించేందుకు ఆయన ఇప్పటినుంచే వారిని మానసికంగా సిద్ధం చేస్తున్నారు. 2047 కల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశం కావాలని ఆయన ఎందుకు అంటున్నారు? 1947లో స్వాతంత్ర్యం వచ్చిన రీత్యా ఆ తర్వాత వందేళ్లకైనా దేశం అగ్రరాజ్యంగా మారకపోతే, ఇంకా వర్ధమాన దేశంగానే మిగిలిపోతే ఆ దేశ నాయకుల గురించి ప్రజలు ఏమను కుంటారు? నిజానికి ఈ వందేళ్లలో 60 ఏళ్ల పాటు కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలే దేశాన్ని పాలించాయి.

# సెయింట్ మేరీ సెంట్రల్ పాఠశాలలో మహాశివరాత్రి వేడుకలు




**శామీర్ పేట (గరుడ వార్త):** మండలంలోని తుర్కపల్లిలో గల సెయింట్ మేరీ సెంట్రల్ పాఠశాలలో గురువారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివపార్వతి వేషధారణలో అలరించారు. విద్యార్థులు స్కూల్లో మహాశివరాత్రి సందర్భంగా శివపూజలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులు శివనాట్యం చేసి పలువురిని ఆకర్షితులను చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల చైర్మన్ ఏళ్లు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి యొక్క గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. శివరాత్రి నాడే ఉపవాసం ఎందుకు ఉండాలి, దైవం యొక్క కటాక్షము మహాశివరాత్రి ఒక గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ గ్రేస్, గౌసియా, పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# వరి పంట తెగుళ్లు నివారణపై అవగాహన

## - రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మాధవిలత





**శామీర్ పేట, (గరుడ వార్త):** వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు పొందగలుగుతారని రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారిణి మాధవిలత తెలిపారు. మంగళవారం శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామంలో వరి పంటల తెగుళ్ల నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు సాధిస్తారని తెలిపారు. రైతులు పంటలు వేసుకునే ముందు మట్టి నమూనాలను పరీక్షించి భూమి సారాన్ని బట్టి పంటలు వేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం వరి పైరుపై మొగి పురుగు కనిపిస్తుందని, పంటలలో జింకులోపం ఉందన్నారు. జింకులోప నివారణకు జింక్ చిలామిన్ 500 గ్రాములు ఎకరానికి వేయాలన్నారు. మొగి పురుగు నివారణకు క్లోరంత్ర నిలిప్రోలు గుళికలు 4 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 కిలోలు వాడుకోవాలని సూచించారు. యూరియాను దఫాల వారీగా పైరుపై చల్లుకోవాలని తెలిపారు. అవగాహన నిర్వహించడంతోపాటు రైతుల పొలాల్లో క్షేత్రస్థాయిలో పైరులను పరిశీలించి సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రవి యాదవ్, రైతులు ఎం ప్రతాప్ రెడ్డి, కుంట మల్లేష్, ఏళ్ల ఎల్లయ్య, ఎం ధర్మారెడ్డి, ఎం వీరారెడ్డి, కొంగ నాగులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# శామీర్ పేటలో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఏల్లు భాయి, జెడ్పిటిసి అనితలు ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలు రాణించాలని వారు పిలుపునిచ్చారు. మహిళలకు పలు క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మమతాబాయి, వైస్ ఎంపీపీ సుజాత, ఎం ఈ ఓ వసంత కుమారి, మహిళా ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

# తెలంగాణ సాహిత్య అకాడమిలో ఉత్సాహంగా మహిళా దినోత్సవం



హైదరాబాద్ : మెరుగైన సమాజం కోసం స్త్రీ పురుషులు ఇరువురు సంఘటితమై సమన్వయం చేసుకుంటూ ఒక స్ఫూర్తితో ముందుకు సాగాలని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి అన్నారు. మహిళ సాధికారతను మరింత సాధించడానికి చేయవలసిన కృషి గురించి వారు అనేక సూచనలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన అనేకమంది ప్రముఖ మహిళలతో 'మెరుగైన సమాజం కోసం సమ్మిళిత స్ఫూర్తితో' అనే అంశంపై చర్చా గోష్టి , కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవయిత్రి మెహెజబిన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య కవులు కళాకారులతో పాటు సాహితీవేత్తలు మేధావులు అంతా కలిసి ఒక వారధిగా ఉండి, మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఏది అయితే అమలు చేయాలంటుందో వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రముఖ కవయిత్రి నెల్లుట్ల రమాదేవి మాట్లాడుతూ మానవ సంబంధాలు బాగా తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మాయిలు తమను తాము రక్షించుకోవడానికి, సంస్కరించుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అమ్మాయిలకు చెప్పే జాగ్రత్తలన్నీ అబ్బాయిలకు కూడా చెప్పాలని సూచించారు. అనంతరం హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళల కష్టాల గురించే గాక మన ఆడపిల్లలతో పిల్లలు పుట్టడం, సెక్స్ గురించికూడా మాట్లాడుతూ నేటి ఆడపిల్లలకు సరైన అవగాహన కల్పించాలన్నారు . మహిళలు తమకు తాము సంస్కరించుకోవడానికి పురుషులను శత్రువులుగా చూడాల్సిన అవసరం లేదని మరో నాయకురాలు ఉప్పల పద్మ అన్నారు. జీవితం గురించి లౌక్యం జరుగుతున్న మార్పులను ఎప్పటికప్పుడు అమ్మాయిలతో మాట్లాడుతూ ఉండాలని కృష్ణవేణి అన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేయాలని చెబుతూ అభము శుభము తెలియని అమ్మాయిలను ఎత్తుకుపోయి వేశ్యాగృహాలకు అమ్ముకోవడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. డాక్టర్ రజిని మాట్లాడుతూ సమాజంలో మనం ఏ అమ్మాయిల ఎదుగుదల గురించి మాట్లాడుకుంటామో ఆ వర్గం వారు లేకుండా చర్చలు చేయడము సబబు కాదని సూచించారు. మహిళా సాధికారత మహిళ అభ్యుదయం తదితరాలపై చదివిన కవితలు ఈ సందర్భంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో అనేకమంది మహిళలతో పాటు కొందరు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# బిజెపి హయాంలో న్యాయం కోరడం నేరం



న్యూఢిల్లీ : ఇద్దరు బాలికలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనలపై ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ ప్రభుత్వాలను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ గురువారం తూర్పారబట్టారు. ఆ రెండు రాష్ట్రాలలో న్యాయం కోరడం నేరం అవుతోందని రాహుల్ ఆరోపించారు. ఫిబ్రవరి 28న ఇద్దరు బాలికలు ఒక పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వారిపై అత్యాచారం జరిగినట్లు ఆరోపణలు వచ్చిన కొన్ని రోజులకు వారి మృతదేహాలు ఒక చెట్టుకు వేలాడుతూ కనిపించాయి. కాన్పూర్ ఘటంపూర్ ప్రాంతంలోని ఒక గ్రామంలో తాము పని చేస్తున్న ఒక ఇటుకల కొలిమి సమీపాన వారి శవాలు కనిపించాయి. 'ఆ రెండు ఘటనల నుంచి నరేంద్ర మోడీ డబుల్ ఇంజన్ ప్రభుత్వాలలో 'ద్వంద్వ అన్యాయం' జరుగుతోందని అర్థం అవుతోంది. యుపిలో అత్యాచారానికి గురైన ఇద్దరు సోదరీమణులు ఉరి వేసుకున్నారు. ఇప్పుడు న్యాయం జరగనందున, కేసు ఉపసంహరణకు ఒత్తిడికి గురై వారి తండ్రి కూడా ఉరి వేసుకున్నాడు' అని రాహుల్ 'ఎక్స్'లో హిందీ పోస్ట్‌లో ఆరోపించారు. 'ఎంపిలో ఒక మహిళకు మానభంగం జరిగింది. ఆమె నిరుపేద భర్త న్యాయం కోసం ప్రాథేయపడ్డాడు. కాని న్యాయం జరగనప్పుడు అతను తన ఇద్దరు పిల్లలతో కలసి ఉరి వేసుకున్నాడు' అని ఆయన ఆరోపించారు. 'డబుల్ ఇంజన్ ప్రభుత్వంలో న్యాయం కోరడం నేరం' అని రాహుల్ అన్నారు. 'బాధితులనే కాకుండా వారి కుటుంబాలను కూడా శత్రువులుగా పరిగణించడం బిజెపి పాలిత రాష్ట్రాలలో ఒక సంప్రదాయంగా మారింది' అని ఆయన విమర్శించారు. 'స్నేహపూర్వక మీడియా' సృష్టించిన 'బోగస్ ఖ్యాతి' ఆ పార్టీకి ఉపయోగపడుతోందని ఆయన అన్నారు. మహిళలపై నేరాల సమస్యపై ఉత్తర ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా కూడా విమర్శలు గుప్పించారు. 'మహిళ కావడం ఈ జంగిల్ రాజ్‌లో ఒక నేరంగా మారింది' అని ప్రియాంక అన్నారు.

# లష్కరే తోయిబా వ్యూహకర్త గుజ్జర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించిన భారత్



న్యూఢిల్లీ: దేశంలో అనేక ఉగ్ర దాడులకు, బాంబు పేలుళ్లకు సూత్రధారి, నిషిద్ధ ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా వ్యూహకర్త మొహమ్మద్ ఖాసీం గుజ్జర్‌ను ఉగ్రవాదిగా నరేంద్ర మోడీ ప్రభుత్వం గురువారం అధికారికంగా ప్రకటించింది. గుజ్జర్ జరిపిన ఉగ్ర దాడులలో అనేక మంది మరణించారని, గాయపడ్డారని, భారత్‌పై యుద్ధానికి కుట్ర పన్నిన వారిలో గుజ్జర్ ఉన్నాడని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశ సమైక్యత, సమగ్రతలకు వ్యతిరేకంగా ఎవరైనా కార్యకలాపాలు సాగిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. భారత్‌పై యుద్ధాన్ని చేపట్టేందుకు కుట్రపన్నిన గుజ్జర్ అలియాస్ సల్మాన్ అలియాస్ సులేమాన్ అనేక ఉగ్రవాద కార్యకలాపాలను సాగించాడు. ఆయుధాలు, మందుగుండు, ఐఇడిలు, నగదును డ్రోన్ల ద్వారా ఉగ్రవాదులకు సరఫరా చేయడం, ప్రదేశాలను గుర్తించడం, ఉగ్రవాదులతో సమన్వయం జరపడం వంటి కార్యకలాపాలలో గుజ్జర్ పాల్గొన్నాడని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. కొత్తవారిని తన సంస్థలో చేర్చుకుని వారికి ఉగ్ర శిక్షణ ఇవ్వడానికి అనేక మార్గాలను అతను ఎంచుకున్నాడు. సోషల్ మీడియాతోపాటు వివిధ కమ్యూనికేషన్ వ్యవస్థలను అతను ఉపయోగించుకున్నాడు. జమ్మూ కశ్మీరులోని రియాసి జిల్లాకు చెందిన 32 ఏళ్ల గుజ్జర్ ప్రస్తుతం పాక్ ఆక్రమిత కశ్మీరులో నివసిస్తూ అక్కడి నుంచే లష్కరే తాయిబా కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఉగ్రవాద నిరోధక చట్టం కింద భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా అధికారికంగా ప్రకటించిన ఉగ్రవాదులలో గుజ్జర్ 57వ వ్యక్తి.

## ప్రాణాలతో బయటపడతానని ఊహించలేదు




నాగపూర్: అత్యంత దారుణమైన జైలు జీవితాన్ని గడిపినప్పటికీ సజీవంగా తాను జైలు నుంచి విడుదల కావడం ఆశ్చర్యంగా ఉందని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా అన్నారు. గురువారం ఉదయం నాగపూర్ కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు. అభియోగాలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని స్పష్టం చేస్తూ ప్రొఫెసర్ సాయిబాబాకు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను బాంబే హైకోర్టు మంగళవారం కొట్టివేసిన దరిమిలా సాయిబాబా జైలు నుంచి విడుదలయ్యారు. తాను సజీవంగా బయటకు వచ్చే అవకాశాలు లేనే లేవని విలేకరులతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. తన ఆరోగ్యం బాగాలేదని, తాను మాట్లాడే పరిస్థితిలో లేనని, ముందు వైద్య చికిత్స చేసుకోవలసి ఉందని, ఆ తర్వాతే మాట్లాడగలనని చెబుతూ విలేకరులతో మాట్లాడేందుకు ఆయన తొలుత నిరాకరించారు. నడవలేని స్థితిలో వీల్ చెయిర్‌కే పరిమితమైన సాయిబాబా న్యాయవాదులు, విలేకరుల నుంచి వచ్చిన అభ్యర్థనలను దృష్టిలో పెట్టుకుని తన మనసు మార్చుకున్నానని తెలిపి అనంతరం విలేకరులతో మాట్లాడేందుకు అంగీకరించారు. త్వరలోనే డాక్టర్లను కలుస్తానని ఆయన చెప్పారు. తన ఎనిమిది సంవత్సరాల అత్యంత దుర్భరమైన జైలు జీవితాన్ని గుర్తు చేసుకుంటూ అది అత్యంత దారుణమైన, కఠినమైనదిగా అభివర్ణించారు. జైలులో తనకు ఏవీ అందుబాటులో లేవని ఆయన తెలిపారు. నా అంతట నేను లేచి నిలబడలేను..వీల్ చెయిర్ నుంచి కదలలేను..సొంతంగా టాయిలెట్‌కు వెళ్లలేను. స్నానం చేయలేను..ఈరోజు నేను జైలు నుంచి ప్రాణంతో బయటపడడం ఆశ్చర్యంగా ఉంది..అసలు నేను జైలు నుంచి విడుదలయ్యే అవకాశాలు లేనే లేవు అని ఆయన అన్నారు. తనపై బూటకపు కేసు నమోదు చేశారని ఆయన చెప్పారు. వాస్తవాలు, సాక్ష్యాలు, చట్టబద్ధత లేని కేసుగా ఉన్నత న్యాయస్థానం ఒకసారి కాదు..రెండుసార్లు నిర్ధారించిందని ఆయన గుర్తు చేశారు. అయినప్పటికీ ఇంత సుదీర్ఘకాలం పాటు ఈ కేసు విచారణ ఎందుకు సాగిందని ఆయన ప్రశ్నించారు. తనతోపాటు తన సహ నిందితులతమ పదేళ్ల జీవితాన్ని కోల్పోయామని, దీన్ని ఎవరు తిరిగిస్తారని ఆయన నిలదీశారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని ప్రత్యేక కోర్టు విధించిన కారాగార శిక్షతో 2017 నుంచి నాగపూర్ జైలులో సాయిబాబా ఖైదీగా ఉన్నారు. అంతకుముందు 2014 నుంచి 2016 వరకు జైలులో ఉన్న సాయిబాబాకు ఆ తర్వాత బెయిల్ లభించింది. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, దేశంపై యుద్ధం చేసేందుకు దారితీసే కార్యకలాపాలు సాగిస్తున్నారని ఆరోపిస్తూ నమోదైన కేసులో ప్రొఫెసర్ సాయిబాబాతోపాటు ఒక జర్నలిస్టు, ఒక జెఎన్‌యు విద్యార్థితోసహా ఐదుగురికి గడ్చిరోలి సెషన్స్ కోర్టు 2017 మార్చిలో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కాగా..ఈ తీర్పును బాంబే హైకోర్టుకు చెందిన నాగపూర్ బెంచ్ మంగళవారం కొట్టివేస్తూ యుఎపిఎ కింద వీరిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతించడం చట్టవిర్ధుమని స్పష్టం చేసింది.

## రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే: ఈసీ



అమరావతి: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే రాజకీయ పార్టీలు ప్రవర్తనా నియమావళిని పాటించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. సచివాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. నామినేషన్ల ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రచారంలో హెలికాప్టర్లు, వాహనాల వినియోగం, సభలు, సమావేశాలు, ఊరేగింపుల నిర్వహణకు ముందుగా తీసుకోవాల్సిన అనుమతుల వ్యవహారంపై సూచనలు చేశారు. ముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చుపై సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియతో పాటు కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీలు, వాటి ప్రతినిధులు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను రాజకీయ పార్టీలు పాటించాలన్నారు. మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి సందేహాలు, గందరగోళం ఉండవని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై రాజకీయ పార్టీలు పలు అంశాలను సీఈవో దృష్టికి తీసుకెళ్లాయి. ఎన్నికల విధుల్లో వలంటీర్ల జోక్యం, కొందరు ఉద్యోగులు తమ పరిధికి మించి వ్యవహరిస్తున్నారని టీడీపీ, సీపీఎం పార్టీలు ఫిర్యాదు చేశాయి.

# అహింస వెనుక అసలు నిజం...!




ప్రపంచ నాగరికతకు భారతదేశం ఏం అందించింది? అంటే వెంటనే యోగా గుర్తుకొస్తుంది. చదరంగం ఆట మనసులో మెదులుతుంది. సర్వసంగ పరిత్యాగులైన రుషులు స్ఫురణకు వస్తారు. గణితం గమనంలోకి వస్తుంది. భారత నాగరికతా ప్రయాణంలో విశిష్టతలకు సంబంధించిన నిర్ధారణలు చాలానే ఉన్నాయి. భిన్న నాగరికతలతో సరిపోల్చి చరిత్రకారులు తేల్చిన వాటిల్లో కొన్నిటిని చూస్తే హృదయాలు ఉప్పొంగుతాయి. మరికొన్నిటి విషయాల్లో విముఖతలూ వ్యక్తమవుతాయి. గొప్ప సంగతులన్నిటికీ భారతదేశమే మూలమన్న సంకుచితత్వం ఆ నిర్ధారణల్లో కనపడదు. ప్రజాస్వామ్యానికి భారతదేశమే పుట్టినిల్లుగా చెప్పే అతిశయోక్తులకు వాటిలో చోటుండదు. ఆధునిక రాజ్యాంగ ఆదర్శాలన్నిటికీ రామరాజ్యంలో పునాదులు ఉన్నాయన్న విపరీత వాదనా వినపడదు. అనాదిగా భారత్‌ది విశ్వగురు పాత్రేనంటూ సాగుతున్న విపరీత ప్రచారమూ కనపడదు. మన చరిత్రను నిష్పక్షపాతంగా పరిశీలించిన వారిలో ఎ.ఎల్. బాషమ్ ఒకరు. ఆయన 1950ల్లో రాసిన 'ద వండర్ దట్ వజ్ ఇండియా' పుస్తకం చాలా ప్రాచుర్యం పొందింది. ప్రపంచవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు ఇప్పటికీ దాన్ని.. ప్రాచీన భారత చరిత్రకు సంబంధించి ఎంతో విలువైన పుస్తకంగా భావిస్తాయి. సంస్కృతంతో పాటు మరికొన్ని భారతీయ భాషలను స్వయంగా నేర్చుకుని మరీ మన చరిత్రను అర్థంచేసుకోటానికి, మదింపువేయటానికి బాషమ్ చేసిన ప్రయత్నం అందులో అడుగడుగునా కనపడుతుంది. గతం పట్ల తీవ్ర విముఖతో మితిమీరిన ఆరాధనో లేకుండా సమతూక చిత్రణనే అందులో చూస్తాం. యుద్ధాలు, హింసలు, ఆక్రమణలు, పరాజితులపై విజేతల జీవన విధానాన్ని రుద్దటం, బలవంతపు మతమార్పిడులు, అధిక భూశిస్తు పీడనలు, బానిసత్వ బంధనాలు అన్ని దేశాల్లోనూ ఒకనాడు ప్రబలంగా ఉండేవి. వీటిల్లో కొన్నిటికి సంబంధించి భారత్ భిన్నదారుల్లో నడిచింది. ఆ భిన్నదారులే ఒకనాడు భారత్‌ను ముందుకు నడిపించాయి. కాలగమనంలో అవే అడ్డుగోడలుగా మారాయి. భిన్నదారుల్లో ప్రధానమైందిగా చెప్పుకోవాలంటే ముందుగా మనకు కనపడేది అహింస. అంటే భారత చరిత్రలో హింస నిర్వహించిన పాత్ర తక్కువగా ఉండటం. దీన్ని గురించి విపులంగా, వాస్తవిక దృష్టితో అనితరసాధ్యం అన్నట్లుగా విశ్లేషించిన వారిలో దామోదర ధర్మానంద కోసంబికి మొదటి స్థానం ఇవ్వాలి. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. ఎంతో సంక్లిష్టతలతో కూడిన సుదీర్ఘచరిత్రపై కోసంబిదైనా మరొకరిదైనా తుది తీర్పు లాంటిదేమీ ఉండదు. కొత్త ఆధారాలు, నూతన విశ్లేషణలు వచ్చినప్పుడు కొన్ని నిర్ధారణలు మారటం సహజం. భారతీయ సంస్కృతి ఆగ్నేయాసియా దేశాల్లో ప్రవేశించటాన్ని అహింసాయుత పరివర్తనకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. క్రీస్తు పూర్వమే ఈ దేశాలకు భారత వర్తకుల ప్రయాణాలు మొదలయ్యాయి. అక్కడే కొందరు శాశ్వత నివాసాలు, స్థానికులతో వివాహబంధాలు ఏర్పరచుకున్నారు. ఆ తర్వాత బ్రాహ్మణులూ బౌద్ధ బోధకులూ వెళ్లారు. వలసవచ్చిన భారతీయుల ప్రభావంతో స్థానిక సంస్కృతులు ఉత్తేజితమయ్యాయి. క్రమేపీ భారతీయ సమాజాన్ని పోలిన కొన్ని వ్యవస్థలు ఏర్పడ్డాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం స్థానికులకు అందింది. వర్గాలు ఏర్పడ్డాయి. వ్యవసాయం బలపడింది. సంస్కృతం వందలేళ్లు రాజభాష అయ్యింది. దేవాలయాలు ఏర్పాటయ్యాయి. తర్వాతి కాలంలో ఆ దేశాలపై చైనా, ఇస్లాం సంస్కృతుల ప్రభావం పడినా భారతీయులు ఆదిలో అందించిన ఘన ఉత్తేజం గణనీయమైంది. అహింసా దారుల్లోనే మరో ముఖ్య పరిణామం మధ్య ఆసియా మీదుగా జరిగింది. మనిషి కేంద్రంగా, అతని పరివర్తనే ఆలంబనగా కొత్త నైతిక దృష్టితో తలెత్తిన జీవన విధానం బౌద్ధం. మొదట్లో ఎంతో హేతుబద్ధతతో, మూఢనమ్మకాలకు తావియ్యని కొత్త జీవన తత్వంగా బౌద్ధం ఉనికిలోకి వచ్చింది. ఆ తర్వాత చాలా మార్పులకు లోనైనా కొన్ని శతాబ్దాలు సమాజాన్ని ముందుకు నడిపించటంలో బౌద్ధం గణనీయ పాత్రను పోషించింది. అటువంటి బౌద్ధం మధ్య ఆసియా మీదుగా చైనా, జపాన్, కొరియాలకు వ్యాపించటం ప్రపంచ చరిత్రలో మరో ముఖ్యమైన పరిణామం. సంస్కృతీ విస్తరణ, తాత్విక ఆలోచనల వ్యాప్తి వంటివి కాకుండా ప్రపంచానికి భారతదేశం అందించిన వాటిల్లో ఇంకా ఘనమైనవీ ఉన్నాయి. పత్తి, చెరకు, బియ్యం, సుగంధ ద్రవ్యాలు, కోళ్ల మచ్చిక, చదరంగం, దశాంశ పద్ధతి, బీజగణితం, సూర్యకేంద్ర సిద్ధాంత పోకడలు లాంటివి ప్రపంచానికి అందటంలో భారత్ పాత్ర ఎనలేనిది. పత్తి లేనిదే ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉండేది కాదు. పారిశ్రామిక యుగానికి ముందు వ్యవసాయం తర్వాత అత్యంత కీలమైనది వస్త్రపరిశ్రమే. భారతదేశానికి పాశ్చాత్య వర్తకులు ఒకనాడు వరుసకట్టడానికి వస్త్ర తయారీలో మన నైపుణ్యమే ప్రధాన కారణం. అంతెందుకు వస్త్ర తయారీలో కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టటంతోనే బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం మొదలైంది. వేరే దేశాల్లో అహింసాయుతంగా భారత సంస్కృతీ వ్యాప్తి గురించి ఎవరికీ పెద్దగా భిన్నాభిప్రాయాల్లేవు. కానీ అంతర్గతంగా కులం ఆధారంగా నెలకొన్న సామాజిక వ్యవస్థ వందల ఏళ్ల పాటు దేశంలో నలుమూలలకు విస్తరించటంలో హింస కంటే అహింస పాత్రే ఎక్కువ. చాలా దేశాల్లో పరాజితులను సంపూర్ణంగా లొంగదీసుకున్నారు. కొన్నేళ్లకు వాళ్ల సంస్కృతీ పునాదులను పెకలించి వేశారు. మరికొన్ని చోట్ల బానిసలుగా మార్చారు. బలప్రయోగం, హింసతో విజేతలు తాము అనుకున్న సామాజిక మార్పును సాధించారు. భారతదేశంలో వేల తెగలు ఒకనాడు విడివిడిగా స్వంత అస్తిత్వంతో కొనసాగాయి. ఉత్తరాదిలో గంగాసింధు నదుల మధ్య నాలుగు కులాలతో ప్రారంభమైన సామాజిక వ్యవస్థ విస్తరించే క్రమంలో యుద్ధాలు అసలు జరగకుండా ఉండలేదు. కానీ అవి పరాజితుల సంపూర్ణ అస్తిత్వ హరణానికి దారితీయలేదు. విస్తరణ క్రమంలో బలవంతుల ఆధిపత్యాన్ని అంగీకరించిన తెగలను, జాతులను కొత్తకులాలుగా స్వీకరించి రైతులుగా, చేతివృత్తుల వారుగా, శ్రామికులుగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో చోటు కల్పించారు. అట్లా చోటు కల్పించటమే కాకుండా అప్పటిదాకా ఉన్న వారి కట్టుబాట్లను, సంప్రదాయాలను, ప్రత్యేకతలను కూడా కొనసాగనిచ్చారు. తెగల దేవతలకు స్థాయిని బట్టి సముచిత స్థానాలను ఇచ్చారు. అమ్మదేవతలు పార్వతి ప్రతిరూపాలుగా మారారు. పురుష దేవుళ్లు శివ, విష్ణు అంశాలను పుణికిపుచ్చుకున్న వారిగా చిత్రీకరించారు. హనుమాన్, గణేశ్ లాంటి ఒకనాటి తెగల దేవుళ్లు హిందూ దేవతా ప్రపంచంలో ప్రముఖ స్థానాన్ని పొందారు. ఈ పరిణామం వందలేళ్లు కొనసాగింది. ఇందులో భాగంగానే దేవతా ప్రపంచం విస్తరించింది. పురాణాలు, స్థలపురాణాల్లో కొత్త కథలు, గాథలు చరిత్ర పొడవునా చేరుతూనే ఉన్నాయి. అందుకే సంఖ్యలో భారత దేవతా ప్రపంచంతో సాటిరాగల లోకం మరొకటి లేదు. తెగలు పవిత్ర చిహ్నాలుగా భావించే కొన్ని జంతువులు ప్రధాన దేవుళ్లకు వాహనాలుగా మారిపోయాయి. కొన్ని వృక్షాలు పవిత్ర స్థానాన్ని పొందాయి. తెగలు కులాలుగా మారే పరిణామం ఏదో ఒక శతాబ్దానికే పరిమితం కాలేదు. సుదీర్ఘకాలం అది సాగింది కాబట్టి కులాల సంఖ్యకూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. వేదకాలంలో చాతుర్వర్ణ ప్రస్తావన మాత్రమే కనపడుతుంది. అదే మనుస్మృతి కాలం నాటికి వందల కులాలు వచ్చాయి. వీటిని వివరించటానికే వర్ణసాంకర్య సిద్ధాంతాన్ని పుట్టించారు. సంప్రదాయం ప్రకారం నాలుగు వర్ణాలు దైవ సృష్టి కాబట్టి.. కొత్తకులాలను వివరించటానికి వర్ణసాంకర్య సిద్ధాంతమే స్మృతికారులకు సహజం అనిపించింది. తెగల్లోని అంతర్వివాహ పద్ధతి యథాతథంగా కులాల్లోకి వచ్చింది. దాంతో కులం ఇంకా గట్టిగా స్థిరపడింది.

# దేవుడున్నాడు- అజ్ఞానం కూడా వుంది?

దేవుడున్నాడని నమ్మే భక్తులతో పాటు మనం కూడా వున్నాడనే నమ్ముదాం. ఎందుకంటే ప్రపంచంలో చీకటి వుంది. అజ్ఞానం వుంది. లేవని అనలేం కదా? అలాగే దేవుడు కూడా వున్నాడు. అజ్ఞానం వున్న చోట దేవుడుంటాడు. జ్ఞానం వెలుగులు ప్రసరించిన చోట మాయమైపోతాడు. ఇందులో మరో మాటకు తావు లేదు. ఊరికే దైవభక్తుల విశ్వాసాలతో గొడవ ఎందుకూ? దేవుడున్నాడు. అజ్ఞానం కూడా వుంది. ఆ రెండూ ఒకటే కాబట్టి అజ్ఞానం దేవుడున్నాడు! దైవభావనలో అజ్ఞానం వుంది!! యదార్థాన్ని ఒప్పుకోని వారితో మనకు పేచీ లేదు. ఈ రకంగా కూడా ఒకసారి ఆలోచించి చూడమని చెపుతున్నాం అంతే!!

పాలల్లో నెయ్యి కనబడదు.


ఈ విశ్వంలో దేవుడు కనబడడు. పాలల్లో నెయ్యి కనబడనంత మాత్రాన నెయ్యి లేనట్టు కాదు గదా? అని ఆస్థికులు వితండవాదం చేస్తుంటారు. వాళ్ళు ఆలోచించాల్సిందేమంటే పాలల్లో నెయ్యి తియ్యడానికి ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం ఎవరు చూసినా, ఎప్పుడు చేసినా, ఎక్కడ చేసినా పాల నుండి నెయ్యి తియ్యొచ్చు. అలాగే విశ్వంలోని దేవుణ్ణి వెలికి తీయడానికి శతాబ్దాలుగా యోగులు, భక్తులు ప్రయత్నిస్తున్నారు. అయినా బయట పడడం లేదు. అన్ని మతాల భక్తులూ ప్రయత్నిస్తూనే వున్నారు. ఎవరేం చేసినా అంతా వృథా! ఏ దేవుడూ ఎక్కడా, ఎప్పుడూ ఎవరికీ కనబడలేదు. సింబాలిక్‌గా వ్యాఖ్యానాలు చేయడం సులభమేమో గాని, నిజంగా వెతికి చూపడం సాధ్యం కాలేదు.

ఇక ముందు కూడా కాదు. లేనిది చూపడం, శూన్యాన్ని ప్రదర్శించడం ఎవరివల్లా కాదు. అలా చూపిస్తామన్న వాళ్ళు మోసగాళ్ళవుతారు. అలాంటి వారికి చట్టప్రకారం శిక్షలు వేయాలే గాని, స్వేచ్ఛగా సభ్య సమాజంలో తిరగనీయరాదు. మెదళ్ళు లేని జనం అలాంటి వారి పాదాల మీద పడి దొర్లుతూ వుంటే, బుద్ధిలేని ప్రభుత్వాలు వారికి వసతులు కల్పిస్తున్నాయి. చూసి ఆనందిస్తున్నాయి!!

సూర్యుడి కిరణాలు చర్మానికి స్పర్శ ద్వారా తెలుస్తున్నాయి. సూర్యుడు వున్నాడు అని అనడానికి ఆధారముంది. మరి దేవుడనే వాడు వుంటే అతడి కిరణాలేవీ? అతడి దయకు, చల్లని చూపుకి ఆధారాలేవీ? ఆస్థికులు మేజిక్కులు రాసుకొని తృప్తి పడుతుంటారు. జనమంతా ఆ మేజిక్కులకు గిమిక్కులకు పరవశించిపోవాలని ఆశిస్తుంటారు. దేవుడుంటే హత్యలు, అత్యాచారాలు ఎందుకు జరుగుతున్నాయి? నేరాలని ఆపలేని దేవుడు నీ కష్టాలను తీరుస్తాడని ఎలా నమ్ముతున్నావ్? దేవుడుంటే తప్పు చేసిన వారికి ఎందుకు చంపడం లేదు? రాక్షసులు తప్పు చేస్తే దేవుడు వారిని శిక్షించాడని, శపించాడని, చంపాడని రకరకాలుగా కట్టు కథలు రాసుకుని శతాబ్దాలుగా ప్రచారం చేస్తున్నారు కదా? మరి ఇప్పుడు సమాజంలో కొందరు తప్పులు చేస్తున్నారు.

నేరాలకు, ఘోరాలకు పాల్పడుతున్నారు 'సంభవామి యుగే యుగే' అని చెప్పుకొన్న ఆ దేవుడు ఎందుకు రావడం లేదు? తన విధ్యుక్త ధర్మాన్ని మరిచిన వాడు దేవుడెలా అవుతాడు? ఏ పనీ చేతకానప్పుడు వున్నా, లేకున్నా ఒకటే కదా? అంటే అంతా అబద్ధమేనన్న మాట! కల్పించుకొన్న కట్టు కథలతో ఎంత కాలమని స్వాంతన పొందుతారు? వాస్తవాల నుండి ఎంత కాలమని పారిపోతారు? దేవుడు వున్నాడని ఘంటాపథంగా ప్రచారం చేసే పురాణాల విషయానికొద్దాం!

'రామాయణ, మహాభారత, భాగవత గ్రంథాలన్నీ పుక్కిటి పురాణాలు కావు, ఇతిహాసాలు!' అని గొప్పగా చెప్పుకొనేవారు ఒక ప్రశ్నకు సమాధానమివ్వాలి. ఇతిహాసం అంటే చరిత్ర! మరి ఈ పురాణ గ్రంథాలలో చారిత్రక అంశాలేవీ? బుద్ధుడి గురించి గాని, మౌర్య వంశం గురించి గాని, గుప్తరాజుల గురించి గాని హర్షుడి గురించి గాని ఎక్కడా ఏవీ లేవెందుకు? ఏడు వందల యాభై యేళ్ళ క్రితం బౌద్ధ విశ్వవిద్యాలయాలు తగులబెట్టి నాశనం చేసిన సంఘటనలు ఈ ఇతిహాసాల్లో లేవెందుకు? ఈ వివరాలన్నీ ఆనాటి చీనీ యాత్రికుల నోట్స్ నుండి సంగ్రహించుకోవాల్సి వచ్చింది కదా? చివరకు సింధూ నాగరికత గురించి ఈ ఇతిహాసాల్లో ఏమైనా వుందా? ఏదీ లేదే? మరి వీటిని 'ఇతిహాసాలని' ఎలా అంటారు? పుక్కిటి పురాణాలనే అనాలి? పైగా బుద్ధుడి కాలంలో ఏ సంస్కృతి వుంది?



బుద్ధుడి తండ్రి ఏ ధర్మం పాటించేవాడు? అని ప్రశ్నిస్తూ అతి తెలివి ప్రదర్శిస్తారు.

ముందు విశ్వాసాల్ని, కట్టు కథల్ని, మహిమల్ని పక్కన పెట్టి యదార్థాన్ని అర్థం చేసుకోగలిగితే, అన్ని అర్థమవుతాయి. బుద్ధుడి కాలంలో విలసిల్లింది శ్రమన సంస్కృతి. అశోకుడి స్తంభాల గురించి ఈ బ్రాహ్మణవాదులకు తెలియదు. తెలుసుకోరు. పైగా అశోక స్తంభాన్ని 'భీముడి గధ' అని ప్రచారం చేస్తారు. ఆ స్తంభాల మీద చెక్కి వున్న శాసనాలు కూడా అర్థం చేసుకోరు. రామాయణ, మహాభారతంలోని అంశాలు అందులో చెక్కి వున్నాయని భ్రమపడతారు. జనానికి కూడా అదే భ్రమ కల్పిస్తారు. ముందు కాస్త చరిత్ర, భూగోళం, సైన్స్ చదువుకోండిరా బాబూ! రామాయణ, భారతాల్ని కావ్యాలనండి. సృజనాత్మక రచనలనండి. అందరూ ఒప్పుకుంటారు. ఇతిహాసాలంటారా? మీరు తప్పులో కాలేసినట్టే. చరిత్రకు ఆధారాలుంటాయి. కట్టు కథలకు ఆధారాలుండవు. గత ఏడు, ఎనిమిది వందల ఏళ్ళ క్రితం తీరిగ్గా కూచుని రాసుకున్న ఈ కల్పిత గాథల్ని ఆ దేవదేవుడే దిగి వచ్చి మానవుడికి అందించిపోయాడని మరో కట్టుకథ అల్లి చెప్పుకోండి సాధారణ శకానికి ముందు (అంటే క్రీ.పూ.) నాలుగైదు వేల యేళ్ళ క్రితం నాటి చరిత్ర అంతా పరిశోధకులు వెలికి తీశారు కదా? మీ దేవదేవుడు ఎక్కడా కానరాలేదు. ఆయన వేదాలు, పురాణాలు ఎక్కడ, ఎప్పుడు ఇచ్చాడో తేదీ, సమయం గట్రా ఆధారాలు తీసి చూపండి. ఉట్టి విశ్వాసాలు ఇప్పుడు నడవ్వు. విశ్వాసాల యుగం అంతమైపోయింది. ఇది ప్రతిదీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి తెలుసుకొనే యుగం ప్రారంభమైంది. ఇంకా చచ్చు పుచ్చు కథలు చెపుతామంటే జనం నమ్మరు. కాలం మారింది.

తరం మారింది. వైజ్ఞానిక అవగాహన పెరిగింది. "విజ్ఞానం ద్వారా బలమైన తాత్వికత, నిజాయితీ, బుద్ధి కుశలత లభిస్తాయి. శ్రమ పట్ల గౌరవం ఏర్పడుతుంది. పెరుగుతుంది" అని అన్నారు ప్రసిద్ధ రష్యన్ రచయిత మాక్జిమ్ గోర్కీ. అన్నం ఉడికిందా లేదా తెలుసుకోవడానికి ఒకటి రెండు మెతుకులు చూస్తే చాలునన్నట్లు పురాణాల్ని అసంబద్ధమైన, తలాతోకా లేని కట్టుకథలని తేల్చడానికి ఒకటి రెండు విషయాలు విశ్లేషించుకుంటే చాలు! రాముడు హనుమంతుడి ఆరాధ్య దైవం. అలాంటి దేవుడి గుప్తాంగాల వివరాలు భక్తుడికి ఎలా తెలుస్తాయీ? వాల్మీకి రామాయణం, సుందరకాండ, 35వ, 17వ శ్లోకం చదివిన వారికి కరెంటు షాక్ తప్పదు. 1927 నాటి ప్రతి నుండి, ఇటీవలి ముద్రణ వరకు (గీతా ప్రెస్ గోరక్‌పూర్) విషయం అంతా ఒకటే. మార్పు లేదు. రాముడి గుప్తాంగాల వర్ణన హనుమంతుడు చేయడం అదీ సీతకు వినిపించడం ఏమిటో మనబోటి వారికి అర్థమే కాదు. "పురాణాల్లో బూతు పురాణాలు వేరయా అని కాదు, పురాణాలంటే బూతు పురాణా లేనయా' అని అనుకోవాల్సి వస్తోంది. విజ్ఞులు ఆలోచించాలి. ఎవరి దగ్గరైనా గీతా ప్రెస్ వారు ముద్రించిన మహాభారతం వుంటే, అందులో అనుశాసన పర్వం తిరగేయండి.

# ఈ జ్యూస్ తాగితే అన్ని జబ్బులకు గుడ్‌బై చెప్పొచ్చు?



కాకర జ్యూస్ ఆరోగ్యానికి చాలా విధాలుగా మంచిది. ఎందుకంటే దీనిలో నీటి శాతం అనేది చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వేసవి కాలంలో ఈ జ్యూస్ తాగితే బాడీ ఎంతో హైడ్రేట్‌గా ఉంటుంది. ఈ జ్యూస్ డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది. సమ్మర్‌లో ఈ జ్యూస్ తాగితే ఇంకా చాలా రకాల ఉపయోగాలు ఉన్నాయి. సమ్మర్‌లో ఎండ దెబ్బకి చర్మం కమిలి పోతూ, నల్లగా మారుతూ, నిర్జీవంగా ఉంటుంది. కాకరలో విటమిన్ సి ఉంటుంది. ఇది చర్మానికి ఎంతో మంచిది చేస్తుంది. ఈ జ్యూస్ తాగతే చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. స్కిన్ ఇన్ ఫెక్షన్స్ నుంచి కూడా రక్షిస్తుంది. సమ్మర్‌లో నీరసంగా, అలసటగా అనిపిస్తుంది. బయటకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఉక్కపోతతతో అల్లాడుతారు. చాలా మంది ఇన్ ఫెక్షన్ల బారిన పడుతూ ఉంటారు. ఇలాంటి సమస్యలు తెలెత్తకుండా కాకరకాయ జ్యూస్ చేస్తుంది. రోజూ ఉదయం కొద్దిగా ఈ జ్యూస్ తాగితే.. శరీరంలో విపరీతంగా రోగి నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల వైరస్, బ్యాక్టీరియాలతో పోరాడే శక్తి లభిస్తుంది. చాలా మంది సమ్మర్‌లో జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. కడుపులో ఉబ్బరం, నొప్పి, అజీర్తి, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలతో సతమతమవుతారు. ఇలాంటి వారు వేసవిలో కాకర కాయ జ్యూస్ తాగితే చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అంతే కాకుండా ప్రేగులు కూడా శుభ్రపడతాయి. కడుపులోని వ్యర్థాలు, మలినాలు బయటకు పోతాయి. కాకర అనేది ఒక దివ్యౌషధం. సరిగ్గా వాడితే ఎన్నో రోగాలు రాకుండా చేసుకోవచ్చు. కాకరలో అనేక రకాల పోషకాలు, ఖనిజాలు ఉంటాయి. అందులోనూ వేసవి కాలంలో తాగితే చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. కాకర జ్యూస్ తాగితే శరీరంలో రోగ నిరోధక శక్తి అనేది విపరీతంగా పెరుగుతుంది. తక్షణమే ఎనర్జీ లెవల్స్ కూడా వస్తాయి. కాబట్టి సమ్మర్‌లో అప్పుడప్పుడైనా కాకర కాయ జ్యూస్ తాగితే చాలా మంచిది.


# మధుమేహాన్ని ఈజీగా నియంత్రించే ఫుడ్స్

మధుమేహాన్ని ఈజీగా నియంత్రించే ఫుడ్స్ ఇవే ?మనం వంటల్లో వాడే పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ ప్రభావాలకు ప్రసిద్ధి చెందిన కర్కుమిన్ ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడానికి కర్కుమిన్ సహాయపడుతుందని నిపుణుల పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే ఉదయాన్నే గోరువెచ్చని నీరు లేదా పాలలో చిటికెడు పసుపును కలిపి తాగడం అనేది ఒక సరళమైన, ప్రభావవంతమైన అలవాటు. ఉసిరి కాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఉసిరికాయను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చు. అందువల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఉసిరికాయ రసం లేదా తాజా ఉసిరిని ఉదయం దినచర్యలో చేర్చడం డయాబెటిస్ నివారణకు మంచిది. షుగర్ సమస్య ఉన్నవారికి ఆకలి ఎక్కువ అవుతుంది. అతి ఆకలి కూడా ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఆకలిని తగ్గించడంలో మెంతులు సహాయపడతాయి. బరువు తగ్గించుకోవాల్సిన అవసరం ఉన్న వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. కొన్ని అధ్యయనాలు మెంతులు మొత్తం కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయని సూచిస్తున్నాయి. ఇది మొత్తం హృదయ ఆరోగ్యానికి ముఖ్యమైనది. ముఖ్యంగా గుండె సమస్యలకు ఎక్కువ ప్రమాదం ఉన్న వారికి తప్పనిసరి. మెంతులు యాంటీ డయాబెటిక్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఈ విత్తనాలలో కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. నానబెట్టిన మెంతులను తినడం లేదా ఉదయం భోజనంలో చేర్చడం వల్ల



మెరుగైన గ్లైసెమిక్ నియంత్రణకు దోహదం చేస్తుంది. కాకరకాయలో పాలీపెప్టైడ్-పి ఉంటుంది. ఇది ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడంలో ఎంతగానో సహాయపడుతుంది. దీనిలో ఉండే విసిన్ ఇంకా లెక్టిన్ ప్యాంక్రియాస్ నుండి ఇన్సులిన్ స్రావాన్ని ప్రేరేపిస్తాయి.

# తులసి నీళ్లు తీసుకుంటే చాలు సర్వరోగాలకు చెక్..!



సాధారణంగా హిందూ సాంప్రదాయంలో తులసికి చాలా పవిత్రమైన స్థానం ఉంది. మనదేశంలో హిందువులంతా తులసి చెట్టులో తమ ఇంటి ముందు ఉంచుకోవడం చాలా శుభప్రదంగా భావిస్తారు. ఇది సాంప్రదాయం ప్రకారం ఎంత పవిత్రము ఆయుర్వేదంలో కూడా అంతే ఉపయోగపడుతుందని చెబుతున్నారు ఆయుర్వేద నిపుణులు. ఎందుకంటే తులసి ఆకులను రాత్రంతా నానబెట్టి ఉదయం పరగడుపున తీసుకోవడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. మరీ ముఖ్యంగా యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా శరీరాన్ని రక్షిస్తాయి. తులసి పరగడుపున తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో ఒకసారి చూద్దాం.. ఎవరైతే తరచూ జలుబు, దగ్గు, జ్వరం అంటూ సీజనల్ ఇన్ఫెక్షన్లకు గురవుతూ ఉంటారు. అటువంటి వారికి తులసి నీరు చాలా బాగా ఉపయోగపడుతుంది. ఇందులో ఉన్న ఆంటీ బ్యాక్టీరియల్ మరియు ఆంటీ ఫంగల్ గుణాల వల్ల రోగనిరోధక శక్తిని పెంచి, దగ్గు జలుబు జ్వరం వంటి రోగాలను దరిచేరకుండా కాపాడుతుంది. అంతేకాక ఎవరైతే తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ ఉంటారో, అటువంటి వారికి కూడా తలసనీరు చాలా బాగా ఉపయోగపడుతుంది. ఇందులో ఉన్న అధిక ఆయుర్వేద గుణాలు అజీర్తి సమస్యలను గ్యాస్, మలబద్ధకం వంటి వాటిని దూరం చేస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ని కరిగించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. అంతేకాక తులసిలో శరీరంలో మంటను తగ్గించే సమ్మేళనాలు పుష్కళంగా లభిస్తాయి. మరియు ఇందులో ఉన్న ఆరోమా నోటి దుర్వాసనను పోగొడుతుంది. సోర్ గొంతు వంటి ఇన్ఫెక్షన్ లను తొందరగా నయం చేస్తుంది. రోజూ ఉదయాన్నే తులసి టీ తాగడం వల్ల చెడు కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది.

# సజ్జలు తీసుకోవడం వల్ల లాభాలు...!




సజ్జలు తీసుకోవడం వల్ల మన శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. దీనిలో ఉండే పోషకాలు మన శరీరానికి ఎంతో సహాయపడుతాయి. సజ్జలతో కొన్ని రకాల వంటలను తయారు చేసుకొని తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు సజ్జలను తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. అలాగే సజ్జలు ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతాయి. సజ్జలతో తయారు చేసి సేమ్యా తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. దీని ఎలా తయారు చేసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.. సజ్జలతో సేమ్యాకి కావాల్సిన పదార్థాలు: సజ్జ పిండి 150 గ్రాములు, గోధుమ పిండి 50 గ్రాములు, ఉప్పు, నీళ్లు సజ్జల సేమ్యా తయారీ విధానం:ముందుగా ఒక గిన్నెలో నీళ్లు తీసుకోవాలి. వీటిని బాగా మరగనివ్వాలి. మరుగుతున్నప్పుడు చెప్పిన పదార్థాలు అన్నీ వేసి ఐదు నిమిషాల పాటు ఉడకబెట్టుకోవాలి. తర్వాత పిండి ముద్దను సేమ్యా తీసుకొవాలి. దీని ప్లాస్టిక్ కవర్ మీద ఒత్తుకోవాలి. వీటిని మూడు రోజుల పాటు ఆరనివ్వాలి. ఈ విధంగా సజ్జల సేమ్యా తయారవుతుంది. ఈ సేమ్యాతో ఉప్మా చేసుకుని తినవచ్చు. ఇది ఎంతో రుచిగా ఉంటుంది. సజ్జలను నేరుగా తినలేని వారు సజ్జలతో సామియాను తయారు చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో అనేక పోషకాలు మరియు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీన్ని తీసుకోవడం వల్ల ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు దూరమవుతాయి. ఇంకా, ఈ విషాన్ని తీసుకోవడం మధుమేహ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ సామియాను పిల్లలకు ఇవ్వడం ద్వారా ఆరోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఈ సేమియాను తీసుకోవడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం మరియు మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. దీన్ని రోజూ అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ సామియాను మీరు ఇంట్లోనే తయారుచేసుకుని తినవచ్చు. సజ్జలతో కొన్ని రకాల వంటలను తయారు చేసుకొని తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు సజ్జలను తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. అలాగే సజ్జలు ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతాయి. సజ్జలతో తయారు చేసి సేమ్యా తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు.

# బ్లాక్ కాఫీ తాగితే ఆరోగ్యానికి అంత మంచిదా?



చాలా మందికి టీ-కాఫీ తాగే అలవాటు ఎక్కువగా ఉంటుంది. మన దేశంలో ఎక్కువ మందికి టీ-కాఫీలని తాగనిదే రోజు గడవదు..అందుకే ప్రతిరోజూ ఉదయం కప్పు కాఫీ, టీ కడుపులో పడితే గానీ, మనస్సాంతి ఉండదు. టీ తాగితేనే రోజువారీ దినచర్య ప్రారంభమవుతుంది. తలనొప్పి, టెన్షన్ నుండి చాలా సులభంగా ఉపశమనం పొందడానికి కాఫీ ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ పాలు, పంచదార కలిపి చేసిన కాఫీ ఆరోగ్యానికి చాలా హానికరం అంటూ ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందుకు బదులుగా, మీరు బ్లాక్ కాఫీ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతారని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. బ్లాక్ కాఫీ తాగడం వల్ల మన శరీరానికి కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు మనం పూర్తిగా తెలుసుకుందాం. కాఫీ శరీరానికి శక్తినిస్తుంది. ఎందుకంటే కాఫీలో కెఫిన్ ఉంటుంది. ఇది మన శరీరంపై అనేక ప్రభావాలను చూపుతుంది. కెఫిన్ అనేది మన మెదడు, నాడీ వ్యవస్థను చురుకుగా, ఏకాగ్రతతో ఉంచడంలో సహాయపడే సహజ ఉద్దీపన. ఇది మన శక్తి స్థాయిలను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. రోజూ ఒక కప్పు బ్లాక్ కాఫీ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కాఫీ బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. బ్లాక్ కాఫీలో క్లోరోజెనిక్ యాసిడ్ అనే పదార్థం ఉంటుంది. ఇది బరువు తగ్గడంలో సహాయపడుతుంది. దీని వల్ల రాత్రి భోజనం తర్వాత శరీరంలో గ్లూకోజ్ ఉత్పత్తి ఆలస్యమై కొత్త కొవ్వు కణాలు ఏర్పడటం తగ్గుతుంది. అప్పుడు బరువు క్రమంగా తగ్గడం ప్రారంభమవుతుంది. ఒక కప్పు బ్లాక్ కాఫీలో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. మీరు కెఫిన్ కలిగిన బీన్స్ ఉపయోగిస్తే మీ కాఫీలో కేలరీల సంఖ్య సున్నా అవుతుంది.

# అలసటను తీర్చే బార్లీ వాటర్...



సమ్మర్ ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. బయట తిరిగొస్తే చాలు చల్లగా ఏవైనా పానీయాలు తీసుకోవాలనిపిస్తుంది ఎవరికైనా. అయితే ఈ సీజన్‌లో ఏవి పడితే అవి తీసుకోవడంవల్ల జీర్ణక్రియ సమస్యలు వస్తాయని, వేడిచేసే అవకాశం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. అలాంటి ఇబ్బందులేవీ లేకుండా ఉండాలంటే ఆరోగ్యకరమైన పానీయాల్లో బార్లీ వాటర్ కూడా ఒకటని, వేసవిలో తీసుకోవడం మేలు చేస్తుందని చెప్తున్నారు. మరి దీనివల్ల ఎటువంటి బెనిఫిట్స్ ఉంటాయో చూద్దాం. లిబార్లీలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే గట్ బాక్టీరియాను బ్యాలెన్స్ చేయడం ద్వారా జీర్ణాశయాంతర సమస్యలను నివారిస్తుంది. కాబట్టి బార్లీని మిక్స్ చేసిన వాటర్ లేదా జ్యూస్, ఇతర ఆహారాలు తీసుకోవడంవల్ల బాక్టీరాయిడ్స్ అనే గట్ బ్యాక్టీరియా సోకకుండా మేలు జరుగుతుంది. హైబీపీని, షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడంలో, టైప్ 2 డయాబెటిస్ రిస్కును తగ్గించడంలో బార్లీ అద్భుతంగా హెల్ప్ అవుతుంది. కాబట్టి మధుమేహ బాధితులు సమ్మర్‌లో బార్లీ వాటర్ తీసుకోవడం మంచిది. అలాగే ఎండవల్ల తగిలే వడదెబ్బ ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది. బార్లీ వాటర్ తాగడంవల్ల జీర్ణాశయం క్లీన్ అవుతుంది. అజీర్తి, మలబద్ధకం వంటి ప్రాబ్లమ్స్ దూరం అవుతాయి. గర్భిణులు దీనిని తీసుకోవడం చాలామంచిది. కాళ్ల వాపు సమస్య రాకుండా ఉంటుంది. ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుందని, అలసట దూరం అవుతుందని నిపుణులు చెప్తున్నారు. అలాగే యూరిన్ ఇన్ఫెక్షన్, వివిధ అలెర్జీలను తగ్గించడంలోనూ బార్లీవాటర్ ముఖ్యపాత్ర పోషిస్తుంది. అయితే ఈ సీజన్‌లో ఏవి పడితే అవి తీసుకోవడంవల్ల జీర్ణక్రియ సమస్యలు వస్తాయని, వేడిచేసే అవకాశం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. అలాంటి ఇబ్బందులేవీ లేకుండా ఉండాలంటే ఆరోగ్యకరమైన పానీయాల్లో బార్లీ వాటర్ కూడా ఒకటని, వేసవిలో తీసుకోవడం మేలు చేస్తుందని చెప్తున్నారు.

# పైనాపిల్ తీసుకుంటే సమస్యలకు చెక్....!



పైనాపిల్ సీజనల్ ఫ్రూట్. బయట్నించి గట్టిగా ముళ్లతో నిండి ఉన్నా లోపల మాత్రం రసంతో కూడి తీపిగా ఉంట్నుంది. కానీ లోపల తియ్యగా ఉంటుంది. పైనాపిల్ రుచి చాలా ప్రత్యేకమైనది, ప్రతి ఒక్కరూ దీన్ని ఇష్టపడతారు. పైనాపిల్‌లో పోషక విలువలు చాలా ఎక్కువ. పైనాపిల్ విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటుంది. ఎందుకంటే దీనిలో విటమిన్ సి, విటమిన్ బి6, ఫోలిక్ యాసిడ్, మాంగనీస్, కాపర్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే ఎంజైమ్స్ కారణంగా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అజీర్తి సమస్యను ఇట్టే తగ్గిస్తుంది. పైనాపిల్ తినడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు దూరమౌతాయి. పైనాపిల్‌లోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. మీ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తుంది. చర్మంలోని మరకలు మరియు మురికిని తొలగిస్తుంది. చర్మ సంరక్షణకు పైనాపిల్ అద్భుతమైనది. ఫైబర్, విటమిన్ సి గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించవచ్చు. అధిక రక్తపోటు సమస్య తొలగిపోతుంది. దీంతో రక్తపోటు అదుపులో ఉంటుంది. అయితే మధుమేహ వ్యాధిగ్రస్తులు పైనాపిల్‌కు దూరంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

# మళ్లీ అందరూ బ్యాంకుల్లో కేవైసీ అప్‌డేట్ చేయాలి?



ఆర్థిక అవసరాలకు బ్యాంకులను ఆశ్రయిస్తుంటారు. దానికి బ్యాంకు ఖాతా అవసరం ఉంటుంది. చాలామందికి ఒకటికి మించి బ్యాంకు ఖాతాలుండడం సహజం. అయితే వేర్వేరు కేవైసీ పత్రాలను ఉపయోగించి ఒక వ్యక్తి తెరచిన పలు ఖాతాలను కనిపెట్టడానికి కేంద్రం చర్యలు తీసుకుంటుంది. దానికి అదనపు గుర్తింపులు కావాలని ప్రత్యేక కమిటీ సూచించింది. బ్యాంకుల్లో ఖాతాలను, ఖాతాదార్లను గుర్తించడానికి అదనపు ధ్రువీకరణ ప్రక్రియలను అమలు చేయనున్నారు. వినియోగదారు సమాచారాన్ని (కేవైసీ-నో యువర్ కస్టమర్) మరింత బలోపేతం చేయడంపై బ్యాంకులు దృష్టి సారించాయి. ప్రస్తుత ఖాతాలన్నిటికీ ముఖ్యంగా పలు ఖాతాలు లేదా జాయింట్ ఖాతాలకు ఒకే ఫోన్ నంబరు ఉన్న ఖాతాలకు దీనిని వర్తింపజేయాలని భావిస్తున్నాయి. వేర్వేరు పత్రాలతో పలు ఖాతాలను తెరచిన ఖాతాదార్ల నుంచి మరిన్ని ధ్రువీకరణలను కోరవచ్చు. ఆర్థిక రంగంలో కేవైసీ నిబంధనలను ప్రామాణీకరించడం కోసం ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో కేంద్రం ఒక కమిటీని గతంలోనే ఏర్పాటు చేసింది. పాన్, ఆధార్, మొబైల్ నంబరు తదితరాలను అదనపు గుర్తింపుల కింద పరిశీలిస్తున్నట్లు ఒక బ్యాంక్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెబుతున్నట్లు కొన్ని మీడియా కథనాల ద్వారా తెలిసింది. వేర్వేరు కేవైసీ పత్రాలను ఉపయోగించి ఒక వ్యక్తి తెరచిన పలు ఖాతాలను కనిపెట్టడానికి, అదనపు గుర్తింపులతో వీలవుతుందని బ్యాంకులు భావిస్తున్నట్లు తెలిసింది.

# 37,490 మెగావాట్ల సోలార్‌పార్క్‌లు..

## ఏయే రాష్ట్రాల్లో ఎంతంటే...



దేశవ్యాప్తంగా పరిశ్రమలు, గృహావసరాలకు విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. కానీ అందుకు సరిపడా కరెంట్ తయారవడం లేదు. సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికి బదులుగా పునరుత్పాదక వనరుల నుంచి విద్యుత్‌ను తయారుచేయాలని చాలాకాలంగా అవగాహన కల్పిస్తున్నారు. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఈ ఏడాది నవంబర్ 30 వరకు 37,490 మెగావాట్ల సామర్థ్యం గల మొత్తం 50 సోలార్ పార్కులకు ఆమోదం తెలిపినట్లు మంగళవారం పార్లమెంటులో వెల్లడించారు. ప్రభుత్వం 40 గిగావాట్ల సామర్థ్యంతో సోలార్ పార్కులు, అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ల అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తోందని పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ పార్లమెంట్‌లో తెలిపారు. న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఈ పథకం కింద నవంబర్ 30 నాటికి దేశంలోని 12 రాష్ట్రాల్లో 37,490 మెగావాట్ల సామర్థ్యంతో 50 సోలార్ పార్కులను మంజూరు చేసినట్లు సింగ్ చెప్పారు. ఇప్పటికే 10,401 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 19 సోలార్ పార్కులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రాల వారీగా గుజరాత్‌లో సుమారు 12,150 మెగావాట్ల సోలార్ పార్క్ ప్రాజెక్టులు మంజూరు అయ్యాయి. ఆ తర్వాత రాజస్థాన్ (8,276 మెగావాట్లు), ఆంధ్రప్రదేశ్ (4,200 మెగావాట్లు), మధ్యప్రదేశ్ (4,180 మెగావాట్లు), ఉత్తర్‌ప్రదేశ్ (3,730 మెగావాట్లు), కర్ణాటకలో 2,500 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్‌పార్క్‌లు మంజూరయ్యాయని మంత్రి చెప్పారు. 1,089 మెగావాట్లు, మహారాష్ట్రలో 750 మెగావాట్లు, కేరళలో 155 మెగావాట్లు, ఛత్తీస్‌గఢ్‌లో 100 మెగావాట్లు, మిజోరాంలో 20 మెగావాట్ల సోలార్ పార్క్ ప్రాజెక్టులు కూడా మంజూరైనట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఈ ఏడాది నవంబర్ 30 వరకు 37,490 మెగావాట్ల సామర్థ్యం గల మొత్తం 50 సోలార్ పార్కులకు ఆమోదం తెలిపినట్లు మంగళవారం పార్లమెంటులో వెల్లడించారు. ప్రభుత్వం 40 గిగావాట్ల సామర్థ్యంతో సోలార్ పార్కులు, అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ల అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తోందని పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ పార్లమెంట్‌లో తెలిపారు.

# ఈ వారమే మార్కెట్‌లోకి వివో వి30 సిరీస్....




భారత మార్కెట్లో ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ వివో నుంచి త్వరలో వివో వి30 సిరీస్ లాంచ్ కానుంది. మార్చి 7న ఈ ఫోన్ లాంచ్ కానుండగా.. ఈ మిడ్-రేంజ్ ఫోన్ ధర వివరాలు ఆన్‌లైన్‌లో లీక్ అయ్యాయి. వి30 బేస్ వేరియంట్ దాదాపు రూ.40వేలు ధర ఉంటుందని తెలుస్తోంది. వివో వి30 ప్రో మోడల్ ధర సుమారు రూ.45వేలుగా ఉండవచ్చు. ఇక రెండు డివైజ్‌ల్లో 6.78-అంగుళాల కర్వడ్1.5కె అమోల్డ్ డిస్‌ప్లేతో 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్, 300హెచ్‌జెడ్ టచ్ శాంప్లింగ్ రేట్, 2,800 నిట్‌ల గరిష్ట ప్రకాశంతో వస్తాయి. ప్రామాణిక మోడల్‌లో క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7 జెనరేషన్ 3 చిప్‌సెట్ ఉంటుంది. అయితే, ప్రో వెర్షన్ మీడియాటెక్ డైమెన్సిటీ 8200 ఎన్‌ఓసీని ఎంచుకుంటుంది. వివో వి30 ఇండోనేషియన్ వేరియంట్ 12జీబీ వరకు ఎల్‌పీడీడీఆర్4ఎక్స్ ర్యామ్, 512జీబీ వరకు యూఎఫ్ఎస్ 2.2 స్టోరేజ్‌ను అందిస్తుంది. అయితే, వి30 ప్రో మోడల్ 12జీబీ ఎల్‌పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, 512జీబీ యూఎఫ్ఎస్ 3.1 స్టోరేజ్‌తో వస్తుంది. ఆండ్రాయిడ్ 14 ఓఎస్ ఆధారంగా ఫన్‌టచ్‌ఓఎస్ 14పై రన్ అవుతున్నాయి. చివరగా, 80డబ్ల్యూ ఫాస్ట్ వైర్డ్ ఛార్జింగ్‌కు సపోర్టుతో 5,000ఎంఎహెచ్ బ్యాటరీ ఉంది.


# మరోసారి తెరపైకి 'మూన్ లైటింగ్'.. ఏడాదికి రూ.2 కోట్లు సంపాదించిన ఐటీ ఉద్యోగి!



మూన్ లైటింగ్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఒకే సమయంలో ఒకటికి మూడు ఉద్యోగాలు చేసి కోట్లు సంపాదించిన ఉద్యోగి భాగోతం వెలుగులోకి వచ్చింది. 2021 నుంచి మూన్‌లైటింగ్‌కు పాల్పడ్డ ఉద్యోగి ఏడాదికి రూ.2.5 కోట్లు సంపాదించాడు. పైగా మూడో ఉద్యోగం సైతం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఇంతకీ ఆ ఉద్యోగి ఎవరు? మూడు ఉద్యోగాలు ఎలా చేశాడు? మూన్‌లైటింగ్! టెక్నాలజీ రంగానికి పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. కోవిడ్-19 విజృంభిస్తున్న సమయంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఉద్యోగులకు ఇంటి వద్ద నుంచి పనిచేసుకునే అవకాశాన్ని కల్పించాయి. దీన్ని ఆసరగా చేసుకున్న ఉద్యోగులు పగలు ఒక సంస్థలో రాత్రి మరో సంస్థలో పనిచేస్తూ రెండు చేతులా సంపాదించారు. దీంతో ప్రొడక్టివిటీ తగ్గడం, ఉద్యోగుల పీఎఫ్ అకౌంట్లు లావాదేవీలు భారీ స్థాయిలో జరగడంతో కంపెనీలు ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించాయి. భారీ ఎత్తున లేఆఫ్స్ ప్రకటించాయి. నాటి నుంచి నియమాకాల విషయంలో హెచ్ ఆర్ విభాగం నిపుణులు కట్టుదిట్టం చేశారు. ఈ నేపథ్యంలో అమెరికాలో కాలిఫోర్నియాకు చెందిన ఐటీ ఉద్యోగి నికోలస్ ఫ్లెమ్మింగ్ తాను మూన్‌లైటింగ్‌కు పాల్పడ్డట్లు బిజినెస్ ఇన్‌సైడర్‌తో తన అనుభవాల్ని పంచుకున్నాడు. 2021 నుండి వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్న నికోలస్.. ఏకకాలంలో రెండు ఉద్యోగాలు చేసేవాడు. అది సరిపోదన్నట్లు మూడు ఉద్యోగంలో చేరాడు. కానీ మూడింటిని చేయడం కష్టమని భావించి అందులో ఒక జాబ్‌ను వదిలేశాడు.

# మీకు ఓటర్ కార్డు లేదా...? ఇదే బెస్ట్ ఛాన్స్...

## ఈ అవకాశం అస్సలు మిస్ కావొద్దు



ప్రజలు తమ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి మరో అవకాశం కల్పించింది ఎన్నికల సంఘం. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎత్తారు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రభుత్వం.. ఇప్పుడు మరోసారి ఓటరు నమోదు, ఓటర్ కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చింది. త్వరలో లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల ప్రక్రియ నమోదుకు శ్రీకారం చుట్టారు. 18 ఏండ్లు నిండే యువతకు ఓటు హక్కు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకొని.. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండే వారు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 20 నుంచి ఇప్పటికే ఉన్న ఓటర్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు.


# భారత్‌లోకి యమహా కొత్త బైక్స్...

## ధర రూ.4 లక్షలు పైనే!




**చెన్నై :** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ యమహా రెండు కొత్త బైకులను భారత మార్కెట్లో విడుదల చేసింది. ఆర్3 పేరిట ఈ కొత్త మోడళ్లను తీసుకొచ్చింది. ఆర్3 మోటార్ సైకిల్ ధరను రూ.4.64 లక్షలు (ఎక్స్‌షోరూమ్, దిల్లీ), ఎంటీ-03 ధరను రూ.4.59 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. జపనీస్ టెక్నాలజీ ఆధారంగా రూపొందిన ఈ రెండు మోడళ్లను పూర్తిగా దిగుమతి చేసి దేశీయంగా విక్రయించనున్నారు. ఎక్స్‌క్లూజివ్‌గా బ్లూస్క్వేర్ డీలర్‌షిప్స్ వద్ద ఇవి లభిస్తాయి. యమహా గతంలో భారత మార్కెట్లోకి తీసుకొచ్చిన ఆర్15ని ఆర్3 పోలి ఉంటుంది. ఇందులో 321 సీసీ లిక్విడ్ కూల్డ్ ట్విన్ ఇంజిన్ అమర్చారు. ఇది 41.4 బీహెచ్‌పీ పవర్‌ను, 29.6 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిక్స్ స్పీడ్ గేర్ బాక్స్ ఇచ్చారు. ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ క్లసర్ ఇచ్చారు. బ్లూటూత్ కనెక్టివిటీ మాత్రం లేదు. పూర్తి ఎల్ఈడీ ల్యాంప్స్‌తో వస్తోంది. ముందువైపు అప్-సైడ్ డౌన్ ఫోర్క్, వెనుకవైపు మోనోషాక్ సెట్‌అప్‌ను అమర్చారు. ముందూ వెనుక డిస్క్ బ్రేకులు ఉన్నాయి. డ్యూయల్ ఛానెల్ ఏబీఎస్ సదుపాయం ఉంది. ఇక ఎంటీ-03 ఎంటీ-15ని పోలి ఉంటుంది. ఇందులో ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్ ఉంది. ఆర్3 తరహాలోనే ఇందులోనూ ముందువైపు అప్‌సైడ్ డౌన్ ఫోర్క్, వెనుకవైపు మోనోషాక్ ఇచ్చారు. ఇందులోనూ 321 సీసీ ఇంజిన్ అమర్చారు. ఇది 42 హెచ్‌పీ పవర్‌ను, 29.5 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6 స్పీడ్ గేర్ బాక్స్ ఉంది. మల్టీ ఫంక్షన్ ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంది. బ్లూటూత్ సదుపాయం లేదు

# గోదాములోని సరుకుపై బ్యాంకు లోన్..



ఉద్యోగులకు రుణాలు కావాలంటే నేరుగా పేస్లిప్‌లు తీసుకెళ్లి అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు బ్యాంకులో ఇచ్చేసి రుణాలు తీసుకుంటారు. అదే రైతులకు రుణాలు కావాలంటే భూమి పట్టా పుస్తకాలు బ్యాంకులో తనఖా పెట్టాల్సి ఉంటుంది. అయితే చాలామందికి వారు పండిస్తున్న పంటభూమికి పట్టాలుండవు. కవులు రైతులు రుణాలు తీసుకోవాలంటే చాలాకష్టంతో కూడుకున్న వ్యవహారం. పంట మార్కెట్‌కు తరలించి వచ్చినకాడికి తెగనమ్ముకుని ఆ డబ్బును తదుపరి పంట కోసం పెట్టుబడికి ఉపయోగిస్తుండడం ఆనవాయితీగా వస్తుంది. భవిష్యత్తులో సరుకు మంచిధర పలుకుతుందని తెలిసినా అవసరాల కోసం అమ్ముకోక తప్పదు. అలాంటి వారికోసం ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించింది. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ఉన్న గోదాముల్లో రైతులు తమ పంటలను స్టోర్ చేసుకుంటే, వీటిపై లోన్లు పొందేందుకు కేంద్రం వీలు కలిపిస్తోంది. ఇందుకు సంబంధించి ఫుడ్ అండ్ కన్జ్యూమర్ అఫైర్స్ మినిస్టర్ పియూష్ గోయల్ సోమవారం 'ఈ-కిసాన్ ఉపజ్ నిధి' డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. ఈ విధానం అమల్లోకి వస్తే రైతుల ఆదాయాలు పెరుగుతాయని మంత్రి అన్నారు. వేర్ హౌస్ ఓనర్లు చెల్లించే సెక్యూరిటీ డిపాజిట్లను ఒక శాతానికి తగ్గిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది 3 శాతంగా ఉంది.

# రికార్డు స్థాయిలో పెరిగిన బంగారం ధరలు..



బంగారం ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అంతర్జాతీయంగా మార్పులు చోటు చేసుకోవడంతో వరుసగా రేట్లు పైకి ఎగబాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్ కు 2127 డాలర్లుగా నమోదైంది. సిల్వర్ ఔన్స్ కు 23.69 డాలర్ల ట్రేడ్ అవుతోంది. 2024 మార్చి 6వ తేదీన ధరలు ఎలా ఉన్నాయంటే బులియన్ మార్కెట్ ప్రకారం.. మార్చి 6న ఓవరాల్ గా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.59,450గా నమోదైంది. 24 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ.65,850 గా ఉంది. మార్చి 5న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.58,750తో విక్రయించారు. 10 గ్రాముల బంగారానికి మంగళవారంతో పోలిస్తే బుధవారం రూ.700 మేర పెరిగింది. న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.59,610 ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.65,010గా నమోదైంది. ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.59,460 కొనసాగుతోంది. 24 క్యారెట్లు రూ.64,860 పలుకుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.60,160 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.65,630తో విక్రయిస్తున్నారు.



# ప్రియుడిని పెళ్లాడనున్న టాలీవుడ్ హీరోయిన్.. డేట్ ఫిక్స్!

బోణీ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన భామ కృతి కర్బందా. ఆ తర్వాత అలా మొదలైంది, తీన్‌మార్ చిఒంగోలు గిత్త, బ్రూస్‌లీ సినిమాలతో మెప్పించింది. అంతే కాకుండా బాలీవుడ్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతంత సినిమాలకు దూరంగా ఉన్న ముద్దుగుమ్మ చివరిసారిగా 14 ఫేరే చిత్రంలో కనిపించింది. అయితే గతనెల లవర్స్ డే రోజున బాయ్‌ఫ్రెండ్ పుల్కిత్ సామ్రాట్‌తో కలిసి ఉన్న ఫోటోను పంచుకుంది. తామిద్దరం కలిసి మార్చ్ చేయబోతున్నాం అంటూ తన పెళ్లి గురించి అభిమానులకు హింట్ ఇచ్చింది. దీంతో ఈ ఏడాది మార్చిలోనే ఈ జంట ఒక్కటి కాబోతుందని వార్తలు కూడా వచ్చాయి.

ఈ నేపథ్యంలో వీరి పెళ్లికి సంబంధించిన వెడ్డింగ్ ఇన్విటేషన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీరిద్దరు మార్చి 13న వివాహాబంధంలోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లీక్ అయిన పెళ్లి పత్రిక నెట్టింట సందడి చేస్తోంది. వెడ్డింగ్ కార్డ్ చూస్తే ప్రముఖ బీచ్ వేదికగా వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. అయితే వివాహా వేడుక ఎక్కడ అనేది ఇంకా తెలియరాలేదు

కాగా.. ఇటీవల ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, తన ప్రియుడు జాకీ భగ్నానీని గోవాలో వివాహం చేసుకున్నారు. దీంతో రకుల్ బాటలోనే వీరు కూడా గోవాలోనే ప్లాన్ చేశారా? అని అభిమానులు భావిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ జంట మార్చి 13న వీరి ఒక్కటి కానున్నట్లు తెలుస్తోంది.

కాగా..పుల్కిత్, కృతి వారి 2018 రొమాంటిక్ కామెడీ 'వీరే కి వెడ్డింగ్' సెట్స్‌లో కలుసుకున్నారు. అప్పటి నుంచే వీరిద్దరు డేటింగ్ ప్రారంభించారు. ఆ తర్వాత పగల్పంటి (2019), తైష్ (2020) సినిమాల్లో స్క్రీన్ కూడా పంచుకున్నారు. ఈ ఏడాది జనవరిలో రహస్యంగా నిశ్చితార్థం కూడా చేసుకుంది. ఎంగేజ్‌మెంట్ వేడుకకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేశాయి. ప్రస్తుతం వైరల్ అవుతున్న వెడ్డింగ్ కార్డ్‌తో ఈ జంట మార్చిలోనే వివాహాబంధంలోకి అడుగుపెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.





# విశ్వక్ సేన్ 'గామి'పై రాజమౌళి ప్రశంసలు

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'గామి'. విద్యాధర్ కాగిత ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.
ఇప్పటికే విడుదలైన ఈ మూవీ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. పలువురు సినీ ప్రముఖులు ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించారు. తాజాగా దర్శకధీరుడు రాజమౌళి కూడా ఇన్‌స్టా వేదికగా 'గామి' చిత్రంపై తన అభిప్రాయాన్ని తెలియజేశాడు. ?

'కఠోరమైన కృషి ఉంటే అసాధ్యమైన కలలు సాకారమవుతాయి. 'గామి' గురించి దర్శకుడు, నిర్మాత ఎంత కష్టపడ్డారో నాతో చెప్పినప్పుడు ఈ మాట గుర్తొచ్చింది. ఇందులోని విజువల్స్ చూస్తే నాలుగేళ్ల నుంచి వాళ్లు ఎంత కష్టపడ్డారో అర్థమైంది' అని తన ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్ట్ పెట్టాడు రాజమౌళి. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. అంతకుముందు ప్రభాస్, నాగ్ అశ్విన్, సందీప్ రెడ్డి వంగా, ఇంకా పలువురు సెలబ్రిటీలు టీమ్‌పై ప్రశంసలు కురిపించారు.

గామి విషయానికొస్తే.. చిన్న సినిమాగా ప్రారంభమైన ఈ మూవీ ఇప్పుడు పెద్ద చిత్రంగా రిలీజ్ అవుతోంది. దాదాపు ఐదేళ్ల పాటు ఈ సినిమాని షూటింగ్ చేశారు. విశ్వక్ తన తొలి సినిమా రిలీజ్ కాకముందే ఈ కథను ఓకే చెప్పేశాడు. ఇందులో ఆయన అఘోరాగా కనిపించబోతున్నాడు. తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార? బోర్డ్ ఈ మూవీకి 'ఏ' సర్టిఫికేట్ జారీ చేసింది.

# అంబానీ ఈవెంట్‌లో రామ్ చరణ్ అవమానం వెనుక జరిగింది ఇదే.. ఆధారాలతో నిజం బట్టబయలు



ఈ మధ్య కాలంలో ఎలాంటి చిన్న విషయం జరిగినా సోషల్ మీడియా వల్ల సెన్సేషన్ అయిపోతోంది. ముఖ్యంగా కొన్ని అంశాలు వివాదాలకు కారణం అవుతున్నాయి. అలాంటిదే ఇటీవలే జరిగిన అనంత్ అంబానీ - రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ ఈవెంట్‌లో జరిగింది.
అక్కడ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌ను బాలీవుడ్ బాద్‌షా షారూక్ ఖాన్ అవమానించాడని ఓ వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా దీనిపై ఆధారాలతో కూడిన వివరణ వచ్చేసింది. అసలు చరణ్‌కు నిజంగానే అవమానం జరిగిందా? అనే విషయాన్ని మీరే చూసేయండి మరి!
తెలుగు నుంచి ఒకే ఒక్కడు:రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, ప్రపంచంలోనే అపర కుబేరుల్లో ఒకరైన ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ వివాహం రాధిక మర్చంట్‌తో నిశ్చయం అయిన విషయం తెలిసిందే. వీళ్లిద్దరూ ఈ ఏడాది జులై 12న జరగనున్న నేపథ్యంలో ఇటీవలే జామ్ నగర్‌లో ప్రీ వెడ్డింగ్ సెలెబ్రేషన్స్ చేశారు. దీనికి టాలీవుడ్ నుంచి రామ్ చరణ్ ఒక్కడే హాజరయ్యాడు.
విఘ్నేష్‌తో ఉన్నా ప్రభుదేవా జ్ఞాపకాలే: సంచలనంగా నయనతార కామెంట్స్
నాటు స్టెప్.. షారూక్ పిలిచి:అనంత్ అంబానీ - రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ ఈవెంట్ కోసం బాలీవుడ్ సెలెబ్రిటీలు చాలా మంది వచ్చారు. ముఖ్యంగా ఖాన్ త్రయం షారూక్, సల్మాన్, ఆమీర్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతేకాదు, వీళ్లు ముగ్గురూ %===% మూవీలోని నాటు నాటు పాటకు సైతం డ్యాన్స్ చేశారు. ఆ సమయంలోనే షారూక్ ఖాన్.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌ను స్టేజ్ మీదకు ఆహ్వానించాడు.
అలా అన్నాడని వివాదం:ఖాన్ త్రయం నాటు నాటు పాటకు స్టెప్ వేస్తున్న సమయంలో నీతా అంబానీ.. రామ్ చరణ్ కూడా ఈ ఈవెంట్‌లో ఉన్న విషయాన్ని షారూక్ ఖాన్‌కు చెప్పారు. అప్పుడతను మైక్‌లో 'ఇడ్లి వడ రామ్ చరణ్ కూడా స్టేజ్ మీదకు రావాలి' అని పిలిచాడు. దీంతో ఉపాసన మేకప్ ఆర్టిస్టు జెబా హాసన్ అలా పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ఈవెంట్ నుంచి బయటకు వెళ్లిపోయారు.
ఆమె నా తల్లి కాదు.. చాలా సార్లు ఇబ్బంది పెట్టింది: రాధికపై వరలక్ష్మి షాకింగ్ కామెంట్స్
షారూక్ సారీ చెప్పాలంటూ:ఈవెంట్ అయిపోయిన తర్వాత జెబా హాసన్ 'రామ్ చరణ్‌ను ఇడ్లీ, వడ' అని పిలవడాన్ని తప్పుబడుతూ పోస్ట్ చేశారు. దీంతో ఈ అంశం పెద్ద వివాదంగా మారిపోయింది. దీన్ని చాలా మంది హైలైట్ చేస్తూ సోషల్ మీడియాలో మాట్లాడడంతో దేశ వ్యాప్తంగా సెన్సేషన్ అయింది. ఫలితంగా రామ్ చరణ్‌కు షారూక్ క్షమాపణలు చెప్పాలంటూ చాలా మంది డిమాండ్ చేస్తున్నారు.
అది సినిమాలో డైలాగయ్యా:మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌ను షారూక్ ఖాన్ 'ఇడ్లి వడ' పేరుతో అవమానించాడని అతడి అభిమానులు సీరియస్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ బాద్‌షా ఫ్యాన్స్ మాత్రం షారూక్ తన సినిమాలోని డైలాగును మాత్రమే చెప్పాడని ఓ వీడియోను షేర్ చేస్తున్నారు. అందులో నిజంగానే అతడు ఫేమస్ టిఫిన్స్‌తో పాటు రజినీకాంత్ పేరును కూడా చెబుతాడు.
ఇంకా గొప్పగా చెప్పాడుగా:అసలు విషయం ఏంటంటే.. 'వన్ 2 కా 4' అనే మూవీలో షారూక్ విలన్‌తో ఫేమస్ వంటకాల గురించి చెబుతూ చివర్లో 'సూపర్ స్టార్ రజినీకాంత్' అంటాడు. అలాగే, ఈ ఈవెంట్‌లో కూడా ఫేమస్ వంటకాల గురించి చెప్పి రజినీకాంత్ ప్లేస్‌లో రామ్ చరణ్ అన్నాడు. అంటే.. అతడిని అవమానించినట్లు కాదు.. ఇంకా పొగుడుతూ మాట్లాడినట్లు అంటూ వీడియో ద్వారా అర్థమైంది.









# శివరాత్రి రోజు చేసే ఉపవాసం అంతరార్థం ఇదే...



హిందువులకు ఎంతో పవిత్రమైన పర్వదినం మహాశివరాత్రి. ఆరోజు ఉదయం శివుడిని పూజించి, ఉపవాసం ఉండి, రాత్రంతా జాగారం చేస్తారు. మహాశివరాత్రి రోజు ఉపవాసం చేయడం వల్ల ఎంతో పవిత్రత వస్తుందని అంటారు. ఆ ఒక్కరోజు ఉపవాసం ఉండి జాగారం చేస్తే ఏడాదంతా శివుడిని ఆరాధించిన పుణ్యం దక్కుతుందని నమ్ముతుంటారు. అయితే, ఉపవాసం చేయడంలో అంతరార్థం దాగి ఉందని ఆధ్యాత్మికవేత్తలు చెబుతున్నారు. సుఖభోగాలు మనిషిని దైవానికి దూరం చేస్తాయి.. ఉపవాసం వంటి కఠిన నియమాల వల్ల ఇంద్రియాల ప్రభావం తగ్గి ఆధ్యాతిక సాధనలకు మార్గం సుగమం అవుతుందని ఆధ్యాత్మికవేత్తలు చెబుతున్నారు. వారానికోసారి ఘనాహారానికి దూరంగా ఉండమని వైద్యులు కూడా సూచిస్తుంటారు. ఆరోగ్య సమస్యల్లేనివారు వారానికోసారి ఉపవాసం చేయాలి. ఇందువల్ల శరీరంలోని విషతుల్యమైన పదార్థాలు బయటకు పోతాయి. జీర్ణకోశానికి తగిన విశ్రాంతి దొరుకుతుంది. అప్పుడప్పుడు ఉపవాసం ఉండటం వల్ల జీర్ణకోశం శక్తి పుంజుకుని సక్రమంగా పనిచేస్తుంది. కటిక ఉపవాసం అనే పేరుతో మంచి నీటిని సైతం సేవించకుండా ఉపవసించడం మంచిదికాదు. శరీరంలో నీటి నిల్వలు తగ్గకుండా చూసుకోవాలి. పాలు, పండ్ల రసాలు తీసుకోవడం వల్ల ఉపవాసం చెడదని పెద్దలు చెబుతారు. ఏదైనా భగవంతునికి నైవేద్యం పెట్టి ప్రసాదంగా స్వీకరించాలి. సూర్యోదయానికి ముందే లేచి అభ్యంగన స్నానం చేసి, శివుని ధ్యానించాలి. అన్నం, పప్పు దినుసులతో చేసిన పదార్థాలు నిషిద్ధం. సముద్రపు ఉప్పు కాకుండా నల్ల ఉప్పు లేదా సైంధవ లవణాన్ని తినే పదార్థాలలో వాడాలి. పాలూ పండ్లూ తినొచ్చు. ముఖ్యంగా దృష్టిని ఆహారం మీద పెట్టకుండా భగవంతుని ధ్యానించడమే ఉపవాస లక్ష్యం. ఆహారం మన ఆలోచనలను నియంత్రిస్తుంది. కనుక సాత్వికాహారమైన పాలు, పళ్లని స్వీకరించాలి. అన్నం పప్పులలో ఉండే ప్రోటీన్లు కార్బోహైడ్రేట్లు అరగడానికి జరిగే ప్రక్రియ వల్ల మెదడుకు రక్తప్రసరణ తగ్గుతుంది. శరీరం భుక్తాయాసంతో మందకోడిగా తయారవుతుంది. అందుకని అన్నం పప్పులు వంటి ఆహార పదార్థాలని ఉపవాస దీక్షా సమయంలో తినకూడదు. ఆరోగ్యం సరిగా లేనివారు, వృద్ధులు, బాలింతలు, గర్భవతులు, చిన్నపిల్లలు ఉపవాస దీక్షను చేయవలసిన నియమం లేదు.

# మహాశివరాత్రి రోజున చేయాల్సిన ముఖ్యమైన పనులేంటో తెలుసా..?

శివం అంటే శుభం అని అర్థం. రాత్రి అనే పదం రా అనే ధాతువు నుండి వచ్చింది. రా అంటే దానార్థరకమైనది. శుభాన్నీ సుఖాన్నీ ప్రదానం చేసేది శివరాత్రి. మహా శివరాత్రి పర్వదినాన ముఖ్యంగా చేయాల్సినవి అభిషేకం, ఉపవాసం, జాగరణ. శివరాత్రినాడు ఉపవాసవ్రతం చేస్తే వారికి అశ్వమేధ యాగం చేసినంత ఫలితం దక్కుతుందని శివపురాణం చెబుతోంది. శివరాత్రినాడు ఉపవాస జాగరణలు చేసినవారు అఖండ ఐశ్వర్యాలను పొంది, జన్మాంతంలో జీవన్ముక్తులౌతారని స్కాంధ పురాణం చెబుతోంది. తనకు ఏపూజ చేసినా చేయకున్నా కేవలం ఉపవాసం చేయడం వల్ల ఆ ఫలితాలన్నీ పొందగలరని మహాదేవుడే పార్వతితో చెప్పాడు.

**ఉపవాస విశిష్టత**

జీవుడు పరమాత్మని సామీప్యంలో వశించడమే ఉపవాసం. ఎటువంటి ఇతరమైన ఆలోచనలూ చేయకుండా, కేవలం భగవంతుని ఆరాధన చేయడమే ఉపవాసమని వరాహొపనిషత్తు చెబుతోంది.

**రుద్రాభిషేకం**

మనసులోని మలినాల్ని తొలగించుకోవడమే రుద్రాభిషేకంలోని పరమార్థం.

**పంచాక్షరి మంత్రం**

పంచాక్షరి మంత్రం శివస్తోత్రాలలో అత్యుత్తమమైనది. ఈ మంత్రంలోని పంచ అనగా అయిదు అక్షరాలు నమ శివాయ(ఓం నమశ్శివాయ)లను మహాశివరాత్రి నాడు భక్తితో పఠిస్తే శివసాయుజ్యం ప్రాప్తిస్తుంది. వీటితో పాటు మహామృత్యుంజయ మంత్రం, శివసహస్రనామస్తోత్రం పఠిస్తే శివానుగ్రహం కలుగుతుంది. అందువల్ల మహా శివరాత్రి రోజున ఉపవాసం, జాగరణ, మహేశ్వరదర్శనం, అభిషేకం, బిల్వార్చన, శివనామ సంకీర్తనల వలన అజ్ఞానం తొలగిపోతుంది. జీవితంలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని శివ పురాణం అవగతం చేస్తుంది.





# మహాశివరాత్రి: లింగోద్భవ సమయంలో శివుడిచ్చిన సందేశమేంటి?

లింగోద్భవ సమయం 01-03-2022 మంగళవారం రాత్రి తెల్లవారితే బుధవారం రాత్రి 12 గంటల 29 నిమిషాల 4 సెకెండ్ల నుండి 12 గంటల 31 నిమిషాల 59 సెకెండ్ల పాటు లింగోద్భవ కాలం.

సర్వేశ్వరుడ్కెన ఈశుడు లింగస్వరూపుడూ అందులోనూ తేజో లింగస్వరూపుడ్కె అవతరించిన మరుక్షణంలోనే మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చాడని వివరించే ఈ కథా సందర్భం శివపురాణంతో పాటు ఇతర పురాణాలలో కూడా ప్రస్తావితమై ఉంది. ఒక్క శివలింగానికి కాసింత పూజను, అభిషేకాన్ని ఏ రోజు చేసినా పుణ్యఫలమే. అందులోనూ శివరాత్రి వేళ లింగోద్భవ సమయంగా చెప్పే సమయంలో ఇక అలాంటి పూజలు, అభిషేకాలు చేస్తే ఎంత గొప్ప పుణ్యఫలం ప్రాప్తిస్తుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరమేముంటుందని పురాణజ్ఞులు, పండితులు అంతా అనే మాట వాస్తవమే. అసలు మనిషి దైవ సందేశాన్నందుకొని లోక యాత్రలో పుణ్య పురుషుడుగా మెలగాలన్నదే మన ఆర్షవాణి, సంప్రదాయ పర్వదినాల అవతరణలో అసలు విషయం.

**లింగోద్భవ సమయంలో శివుడిచ్చిన సందేశమేమిటి?**

ఆభవుడికి, భవనాశనుడికి, శంకరుడికి నచ్చనిది ఏది? అనే విషయం కూడా ఇక్కడ ప్రస్తావితమై కనిపిస్తుంది. పూర్వం ఓసారి బ్రహ్మకు, విష్ణువుకు తాను గొప్పంటే తాను గొప్పన్న అహంకారం కలిగింది. అది కాస్త తీవ్ర రూపం దాల్చి యుద్ధ స్థాయికి చేరింది. లోకాలన్నీ ఆ తగవు లాటవల్ల భీతిల్లుతున్న తరుణంలో చంద్ర శేఖరుడు హరిబ్రహ్మలకు జ్ఞానాన్ని ప్రసాదించాలను కున్నాడు. వెంటనే వారి ముందు ఒక దివ్యతేజోరాశిని ఆద్యంతాలు తెలియని స్తంభలింగరూపంలో అవతరించేలా చేశాడు. అప్పటిదాకా అక్కడ లేని ఆ దివ్యతేజోస్తంభం ఏమిటా అని హరి, బ్రహ్మలు యుద్ధంమాని విస్తుపోతూ చూశారు. వెంటనే పార్వతీ వల్లభుడు తన దివ్యలీలా విలాసంతో వారికి ఓ పరీక్ష పెడుతున్నానని, ఆ స్తంభం(లింగం) అగ్రభాగాన్ని ఒకరు, అడుగు భాగాన్ని మరొకరు చూసి రావాలని,ఎవరు ముందుగా వస్తే వారే గొప్పని,వారికే సర్వాధిపత్యం అని చెప్పాడు. వెంటనే బ్రహ్మ హంసరూపుడ్కె ఆ తేజోలింగం అగ్రభాగానికి చేరటానికి వెళ్ళాడు. విష్ణువు వరాహరూపుడ్కె ఆ లింగం మూలం ఎక్కడుందో తెలుసుకోవటానికి పాతాళం వ్కెపు ప్రయాణం చేశాడు. హరి, బ్రహ్మలకు ఆ దివ్యతేజో రాశి ఆద్యంతాలు ఎంతకీ అంతు పట్టలేదు.

ఇంతలో పై నుండి ఒక కౌతకి (మొగలిపువ్వు) రావటం హంస రూపంలో ఉన్న బ్రహ్మ చూశాడు. బ్రహ్మ మొగలి పువ్వును ప్రలోభపెట్టి తాను ముందుగా తేజో రాశి అగ్రభాగాన్ని చూశానని చెప్పుకోవటానికి సాక్ష్యంగా ఉండమని కోరాడు. పాతాళం వ్కెపు వెళ్ళిన విష్ణువుకు తేజోరాశి పీఠభాగం ఎంత దూరం వెళ్ళినా కనిపించలేదు. ఇంతలో అబద్ధపు సాక్ష్యం చెప్పేందుకు మొగలి పువ్వును వెంట పెట్టుకొని శివుడి దగ్గరకొచ్చాడు. బ్రహ్మ, ఆ తర్వాత కొద్ది సేపటికి విష్ణువు తేజోలింగం అడుగు భాగం తాను కనుక్కోలేక పోయానని బాధపడుతూ పై కొచ్చాడు. శివుడికి బ్రహ్మ తేజోరాశి అగ్రభాగాన్ని తాను చూశానని అందుకు సాక్ష్యంగా కేతకిని కూడా వెంటపెట్టుకొచ్చానన్నాడు. ఆ అసత్య మాటలకు శివుడికి కోపం ముంచుకువచ్చిది. వెంటనే భ్కెరవుడిని సృష్టించి అసత్యమాడి నందుకు బ్రహ్మను దండించ మన్నాడు. భ్కెరవుడు అప్పటిదాకా బ్రహ్మకున్న ఐదుతలలలో అబద్ధం ఆడిన తలను తుంచేశాడు. తరువాత తప్పును తెలుసుకున్న బ్రహ్మ ఈశుడిని శరణు వేడుకొన్నాడు. పక్కనే ఉన్న విష్ణువు కూడా అప్పటికే శివుడి



గొప్పప్పతనాన్ని గ్రహించి శివుడికి నమస్కరించాడు.

బ్రహ్మ తప్పును క్షమించమని కూడా వేడుకున్నాడు. శరణాగత వత్సలుడ్కెన శంకరుడు చల్లబడ్డాడు. ఇంతకు ముందు లాగానే బ్రహ్మకు సృష్టి అధికారం ఉంటుందని, అయితే ఇతర దేవతల్లాగా బ్రహ్మకు ఆలయాలు, పూజలు ఏవీ ఉండవని చెప్పాడు. అబద్ధం ఆడకుండా వాస్తవాన్ని తెలిపిన విష్ణువు అందరి చేత పూజలందుకుంటాడని, స్థితి కారకుడిగా వెలుగొందుతాడని అన్నాడు. మొగలిపువ్వును చూసి అసత్యమాడిన పాపానికి తన పూజలో మొగలిపువ్వుకు చోటుండదని అన్నాడు. అయితే ఆ కేతకి శివుడికి పరిపరివిధాల ప్రణమిల్లింది. భక్తవత్సలుడ్కెన శివుడు అప్పుడు కొంత శాంతించి శివపూజకు పనికి రాకపోయినా శివభక్తులు మాత్రం మొగలిపువ్వును ధరిస్తారని, అలా జన్మను చరితార్థం చేసుకోమని చెప్పి అంతర్ధానమయ్యాడు. ఈ కథా సందర్భంలో ఎంతటి వారైనా అసత్యమాడితే పాపఫలితాన్ని అనుభవించాల్సి ఉంటుందని తెలియజెప్పే సందేశం ఇమిడి ఉంది. మానవులాంతా సత్యమార్గంలోనే నడుచుకోవాలన్న ఈశ్వర సందేశం ఇక్కడ కనిపిస్తోంది.

# బిజెపి 'వాషింగ్ మెషీన్'

## – అవినీతి నిందితులు చేరి నిష్కళంకులు అవుతున్నారు
## – బిజెపియేతర సిఎంలను లక్ష్యం చేసుకున్న కేంద్రం – శరద్ పవార్ విమర్శల వర్షం

పుణె : ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ గురువారం భారతీయ జనతా పార్టీ (బిజెపి)పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బిజెపి ఒక 'వాషింగ్ మెషీన్'లా మారిందని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు 'నిష్కళంకులు కావడానికి' ఆ పార్టీలో చేరుతున్నారని శరద్ పవార్ ఆరోపించారు. హేమంత్ సోరెన్ (ఝార?ండ్), అర్వింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ)తో సహా బిజెపియేతర రాష్ట్రాల సిఎంలను కేంద్రం లక్షం చేసుకుంటున్నదని ఆయన విమర్శించారు. వివిధ అంశాపై ప్రధాని నరేంద్ర మోడీని కూడా పవార్ విడిచిపెట్టలేదు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై విమర్శలు చేసినందుకు మోడీని పవార్ తప్పు పట్టారు. పుణె జిల్లా లోనవాలాలో తన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరత్‌చంద్ర పవార్) కార్యకర్తల సమ్మేళనంలో పవార్ ప్రసంగిస్తూ, 'ప్రధాని నరేంద్ర మోడీ అవినీతి గురించి మాట్లాడేటప్పుడు అవిభాజ్య ఎన్‌సిపిని విమర్శిస్తుండేవారు. బిజెపి అధికారంలో లేనప్పుడు ఎటువంటి అవకతవకలు జరిగాయో వివరించే కరపత్రాన్ని పార్లమెంట్‌లో ప్రతి ఒక్కరికీ ఇచ్చారు. ఆ కరపత్రంలో ఆదర్శ్ కుంభకోణం, అశోక్ చవాన్ పాత్ర గురించి ప్రస్తావన ఉన్నది. కాని ఏడవ రోజు చవాన్ బిజెపిలో చేరి రాజ్యసభ సభ్యుడు అయ్యారు అంటే ఒక వైపు మీరు (బిజెపి)ఆరోపణలు చేస్తూ మరొక వైపు ఆ వ్యక్తిని మీ పార్టీలో చేర్చుకుంటారు'అని చెప్పారు. అంతకుముందు ప్రధాని మోడీ ఎన్‌సిపిలోని 'అవినీతిపరుల' గురించి మాట్లాడారు. 'మహారాష్ట్రలో రూ. 70 వేల కోట్లు విలువ చేసే నీటిపారదల కుంభకోణం గురించి ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర రాష్ట్ర సహకార బ్యాంక్‌లో అవకతవకలపై కూడా ఆయన మాట్లాడారు. ఎన్‌సిపిలోని ఎవ్వరికీ ఎంఎస్‌సి బ్యాంక్‌లోని అవకతవకలతో సంబంధం లేదని నేను అప్పట్లో




చెప్పి, సుప్రీం కోర్టు న్యాయమూర్తి నియామకంతో దర్యాప్తు జరిపించాలని సవాల్ చేశాను. ఆ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి ఇప్పుడు ఎక్కడ ఉన్నారో చూడండి' అని శరద్ పవార్ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌పేరు ప్రస్తావించకుండా అన్నారు. 'బిజెపి వాషింగ్ మెషీన్‌లా మారిందని ఇదంతా సూచిస్తోంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు చేరి నిష్కళంకులు కావచ్చు' అని శరద్ పవార్ అన్నారు. శరద్ పవార్‌పై నిరుడు జూలైలో అజిత్ పవార్ తిరుగుబాటు చేసి పలువురు ఇతర ఎన్‌సిపి నేతలతో పాటు ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరారు. అజిత్ పవార్ ఆవిధంగా సీనియర్ పవార్ 1999లో స్థాపించిన పార్టీలో చీలిక తెచ్చారు. ప్రధాని మోడీ ఇప్పుడు నెహ్రూను, ఆయన సిద్ధాంతాన్ని వివరీతంగా విమర్శిస్తుంటారని శరద్ పవార్ ఆక్షేపించారు.

## 'మేకింగ్ ఏఐ వర్క్ ఫర్ ఇండియా' కోసం కేంద్రం కీలక నిర్ణయం..

# టెక్నాలజీలో భారత్ సరికొత్త విప్లవం..



న్యూఢిల్లీ: ఏఐ ఈ రెండు అక్షరాలు నేడు ప్రపంచాన్ని శాసిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనే కొత్త సాంకేతికతను ప్రతి ఒక్క రంగం అందిపుచ్చుకుంటోంది. స్కూల్ పిల్లల మొదలు గేమ్స్ వరకు అంతా విస్తరించింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక బడ్జెట్ ను రూపొందించింది. నేడు జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో రూ. 10,371.92 కోట్లతో జాతీయ స్థాయి ఇండియా ఏఐ మిషన్ కు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ మొదలు పెద్ద పెద్ద పారిశ్రమల వరకు అన్నింటా తానై, అన్నీ తానై ఈ సాంకేతికత విప్లవంలా దూసుకుపోతోంది. దీనిని ఉపయోగించడం ద్వారా అనేక ఐటీ సంస్థలు ఆధునికతను మరింత అందిజుచ్చుకుంటున్నాయి. దీనిని అందిపుచ్చుకొని గొప్ప విజయావకాశాలు సాధించాలని భారత ప్రధాని చాలా సార్లు ప్రస్తావించారు. అందుకు అనుగుణంగా నేడు ఈ సరికొత్త నిర్ణయానికి ఆమోదం తెలిపారు. 'మేకింగ్ ఏఐ వర్క్ ఫర్ ఇండియా' అనే విజన్ తో భారత్ సాంకేతిక పరంగా అత్యున్నత శిఖరాన్ని చేరాలని సంకల్పించారు ప్రధాని. ఈ మిషన్ ను ప్రవేశ పెట్టడం ద్వారా విద్య, వైద్య, పారిశ్రామిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుతాలు సాధించవచ్చున్నారు.



# పాలమూరు పాలిట శాపాలు కాంగ్రెస్, చంద్రబాబే: హరీష్ రావు

సంగారెడ్డి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు వేదికగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. మహబూబ్ నగర్ వెనుకబాటు తనానికి కారణం నాటి టిడిపి, కాంగ్రెస్ పాలన అని ధ్వజమెత్తారు. రేవంత్ తిట్టాల్సి వస్తే తన గురువు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును తిట్టాలని, కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను నిందించాలని సూచించారు. చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ పార్టీ లోపాలు, పాలమూరు పాలిట శాపాలుగా మారాయని తెలియజేశారు. . పాలమూరు వలసలకు కారణం ఆ రెండు పార్టీలేనిని, గత పార్టీలు ప్రాజెక్టుల పేర్లు మార్చారు తప్ప పనులు పూర్తి చేయలేదని, తాము పెండింగ్ ప్రాజెక్టును రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని, అలాంటి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తిట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాలమూరు వేదికగా సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సంగారెడ్డిలో రీకౌంటర్ ఇచ్చారు.




పేగులు మెడలో వేసుకొని రాక్షసులు తిరుగుతారని, ముఖ్యమంత్రి మాట్లాడే భాష అదేనా, పడిగట్టు పదాలు, పరుష పదజాలంతో పరిపాలన సాగదని, ప్రతిపక్షంలో ఉన్నట్లు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరించారు. మంచిపేరు తెచ్చుకోవాలంటే వల్గారిటీ కాదు అని, చిల్లర మల్లర భాష మాట్లాడి పదవి గౌరవం తగ్గించుకోవద్దని రేవంత్ కు చురకలంటించారు. తన ఎత్తు గురించి ఆయన మాట్లాడుతున్నారని, తాను అలా మాట్లాడి విలువ తగ్గించుకోనని, కుసంస్కారంగా మాట్లాడటం వల్ల విలువ దిగజారుతుందని, భవిష్యత్ లో రాజకీయాలకు వచ్చే వారికి స్ఫూర్తిగా మనం ఉండాలని, ఎంత ఎత్తు ఉన్నమన్నది కాదు అని, ప్రజల కోసం ఎంత గట్టిగా పని చేశామన్నది ముఖ్యమని, కెసిఆర్ కిట్లు తెస్తే, రేవంత్ రెడ్డి తిట్లతో పోటీ పడుతున్నడని హరీష్ రావు ఎద్దేవా చేశారు. మహబూబ్ నగర్ జిల్లా ప్రజలను రెచ్చగొట్టి రాజకీయలబ్ధి పొందాలని రేవంత్ చూస్తున్నారని, బిఆర్ఎస్ పాలనలో పాలమూరు ప్రజల బతుకులు బాగుపడ్డాయని, కెసిఆర్ పాలనలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పడ్డాయని, పదేళ్ల పాలమూరును చంద్రబాబు దత్తత తీసుకొని ఒక్క ఎకరాకు నీళ్ల ఇవ్వలేదని మండిపడ్డారు. పాలమూరు వలసలు వాపస్ చేసింది కెసిఆర్ కాదా? అని ప్రశ్నించారు. వలసలకు నిలయం నాటి పాలకులు చేస్తే, వ్యవసాయానికి నిలయం చేసింది కెసిఆర్ అని కొనియాడారు. తన తండ్రి చనిపోతే స్నానం చేసేందుకు నీళ్ల లేక నెత్తి మీద నీళ్ల చల్లుకొని వెళ్లినా అని స్వయంగా రేవంత్ రెడ్డి చెప్పారని, ఆ సమయంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ కాదా? అని హరీష్ రావు నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులను కాగితాలకు పరిమితం చేసింది కాంగ్రెస్ కాదా?, పాలమూరు కరువుతో రాజకీయాలు చేసింది కాంగ్రెస్, టిడిపి కాదా?, కెసిఆర్ పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారని, పోతిరెడ్డి పాడుకు పొక్క కొట్టి వైయస్ నీళ్ల తీసుకువెళ్తే రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదని విమర్శించారు. కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను నాడు కాంగ్రెస్ ఎందుకు పూర్తి చేయలేదని, 1984లో కల్వకుర్తికి కొబ్బరికాయ కొట్టి 2014 వరకు 13వేల ఎకరాలకు నీళ్ల ఇచ్చారని, కానీ మేము పదేండ్లలోనే 2600 కోట్లు ఖర్చు చేసి 3 లక్షల 7వేల ఎకరాలకు నీళ్ల అందించామన్నారు.

# మిద్దెతోటల నిర్వహణకు మహిళలు ముందుకు రావాలి



హైదరాబాద్ : పసుపు,ఉప్పు,కారం తో పాటు అన్ని రకాల ఆహార పదార్థాలు కల్తీ అవుతున్న నేపథ్యంలో ఈ కల్తీని అరికట్టేందుకు మిద్దేతోటల నిర్వహణకు మహిళామణులంత ముందుకు రావాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. గురువారం రైతు నేస్తం ఫౌండేషన్ ఆద్వర్యంలో రెడ్ హిల్స్ లోని సురాన ఆడిటోరియంలో జరిగిన 2023- రైతు నేస్తం మిద్ది తోట అవారడ్స్ కార్యక్రమానికి మంత్రి తుమ్మల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతు నేస్తం తుమ్మేటి రఘోత్తం రెడ్డి మిద్దేతోట పురస్కారాలను మంత్రి ప్రదానం చేశారు.


ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మిద్దేతోటలకు సంబంధించి ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలను కొనసాగించే ప్రయత్నం చేస్తామని, వారికి నిరంతరం సలహాలు , శిక్షణ ఇచ్చే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. ప్రభుత్వం ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమంలో మిద్దేతోటలు అంశాన్ని కూడా చేర్చి ఆరోగ్య తెలంగాణకు కృషి చేస్తామని చెప్పారు. మహిళలంతా మిద్దేతోటలు మీద దృష్టి పెట్టి ఇంటిల్లిపాదికి అవసరమైన కూరగాయలు, పండ్లు పండిస్తూ తోటి వారికి పంచుతూ ముందుకు సాగాలని సూచించారు . ఈ సందర్భంగా రైతు నేస్తం వేంకటేశ్వర రావును అభినందిస్తూ అతని రైతు సేవా కార్యక్రమాలు మరింత గా విస్తరించాలని ఆశీర్వదించారు. రైతు నేస్తం పేరుతో రైతు వేదికలన్నింటిని సమన్వయపరుస్తూ, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సహకారంతో ప్రభుత్వం రైతుల సాగు సమస్యలకు పరిష్కారం చూపించే ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించిందని మంత్రి పేర్కొన్నారు.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతునేస్తం మిద్దెతోట పురస్కారాలను మొత్తం 24 మందికి అందజేశారు. కె. శ్రీనివాస్ ( ఖమ్మం), బి. మాధవి జొన్నాడ (అంబేద్కర్ కోనసీమ జిల్లా ), బండి మల్లేశ్వరి ( సంగారెడ్డి ), బి. శివరాణి మొవ్వ (కృష్ణా జిల్లా ), కె. బాల్‌రెడ్డి(భువనగిరి), కె. సామ్రాజ్యం (విజయవాడ), ఎం. దివ్య (శంషాబాద్ ), వై. శేషకుమారి ( రాజమండ్రి ), స్వరూప ( టెర్రస్ గార్డెన్, ఉద్యానశాఖ, హైదరాబాద్), డి. ప్రియబాంధవి (విశాఖపట్నం), సివిఎల్. నరసింహారావు (చీర్యాల, సికిందరాబాద్ ), విజయల (ఒంగోలు), ఎం. ప్రేమ్‌రాయ్ (మల్కాజ్‌గిరి, సికిందరాబాద్ ), డి. శ్రీదేవి (విజయవాడ), ఎన్. రాజ్‌వర్ధన్ (శంషీగూడ, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ), షేక్ కైసరీ బేగం (ఖమ్మం ), ఎం. ఐశ్వర్య (గాజువాక, విశాఖపట్నం), డి. లక్ష్మి రెడ్డి (కావలి ), టి. అప్పారావు (అమీర్‌పేట్, హైదరాబాద్), జి. మంజుల ( నెల్లూరు ), ఇమ్మడిశెట్టి ప్రభాకర్‌రావు (హన్మకొండ ), వాణి (గుంటూరు ), కె. ఎలిజబెత్ (నాగారం, హైదరాబాద్), మలిశెట్టి శ్రీదేవి (కాకినాడ) తదితరులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు ఎం. కోదండరెడ్డి, రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు, ఆత్మీయ అతిథిగా ప్రముఖ మిద్దెతోట నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి, మరో మిద్దెతోట నిపుణురాలు పిన్నక పద్మ తోపాటు ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.

## రామేశ్వరం కేఫ్ పేలుడు: దుస్తులు మార్చుకుని..

# బస్సులో ప్రయాణించి..

బెంగళూరు: నగరంలోని రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు సృష్టికర్తగా అనుమానిస్తున్న నిందితుడికి సంబంధించిన కీలక వివరాలు దర్యాప్తులో లభించినట్లు కర్నాటక హెూం మంత్రి పరమేశ్వర గురువారం వెల్లడించారు. పేలుడు సంఘటన అనంతరం అనుమానితుడు తన దుస్తులు మార్చుకుని బస్సులో ప్రయాణించినట్లు విశ్వసనీయంగా తెలిసిందని ఆయన చెప్పారు. అనుమానితుడికి సంబంధించిన అనేక ముఖ్యమైన ఆధారాలు లభించినట్లు తన నివాసంలో విలేకరులకు ఆయన తెలిపారు. ఈ వివరాలన్నిటినీ ఇప్పుడు వెల్లడించలేమని, అయితే త్వరలోనే అనుమానితుడిని అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు. కాగా..తాజాగా లభించిన సిసిటివి ఫుటేజ్‌లో అనుమానితుడు ముదురు రంగు క్యాప్, వీపున బ్యాగ్, పొడుగు చేతుల చొక్కా, షూస్, ముఖానికి మాస్కు ధరించి బస్సులో ప్రయాణించడం కనిపించింది. అయితే టీషర్ట్, తలకు క్యాప్, ముఖానికి మాస్కు ధరించి బస్సులో కూర్చుని ప్రయాణిస్తున్న అనుమానితుడి అనధికారిక ఫోటో కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అనుమానితుడి ఆచూకీ చెప్పిన వారికి రూ.10 లక్షల బహుమతి ఇస్తామని ప్రకటిస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఎ) బుధవారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో బుధవారం



అతడి ఫోటోను కూడా షేర్ చేసింది. సిబిఐ ఈ కేసును చేపట్టినప్పటినప్పటికీ పేలుడు కేసు దర్యాప్తును ప్రాథమికంగా నిర్వహించిన బెంగళూరు పోలీసుకు చెందిన సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్(సిసిబి) కేంద్ర దర్యాప్తు సంస్థకు సహాయసహకారాలు అందచేస్తోంది. మార్చి 1న మధ్యాహ్నం లంచ్ అవర్‌లో బ్రూక్‌ఫీల్డ్ ప్రాంతంలోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన ఐఇడి పేలుడులో 10 మంది గాయపడ్డారు.

## సిరుల సింగరేణి ప్రగతి పథంలో మరో ముందడుగు..

# గుడ్ న్యూస్ చెప్పిన బట్టి

న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిశారు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమర్క. కేంద్ర అనుమతి లేక ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో తాడేపల్లి సెకండ్ బ్లాక్ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.తాడిచర్ల-2 కోల్ బ్లాక్ కి అప్రూవల్‌పై కేంద్రం సానుకూలంగా స్పందించడం శుభవార్త అన్నారు డిప్యూటీ సీఎం. తాడిచెర్ల రెండో బ్లాక్‌లో 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం వుందన్నారు భట్టి విక్రమార్క. సింగరేణికి, రాష్ట్రానికి ఇది ప్రయోజనమన్నారు. ఒడిషాలోని నైని కోల్ బ్లాక్‌లో తెలంగాణకు కేటాయింపులు చేసినప్పటకి అందుకు సంబంధించి ఆపరేషన్స్ ఇంకా మొదలు కాలేదు. ఆ విషయంలో కూడా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి సానుకూలంగా స్పందించారన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. అటు కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్‌తోనూ సమావేశమయ్యారు భట్టి విక్రమార్క. గ్రీన్ పవర్ సహా ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై చర్చించారు. పేదల ఇళ్లకు సోలార్ కరెంట్ అందించేలా కేంద్రం ఇచ్చే సబ్సిడీ కి అదనంగా మరింత ఖర్చును భరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పథకాన్ని కేంద్రమంత్రికి వివరించారు భట్టివిక్రమార్క. అభినందడంతో పాటు తప్పక చేయూతనిస్తామని ఆర్కేసింగ్ సానుకూలంగా స్పందించారన్నారు.



Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com